
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 4 | సంచిక : 20 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, జూలై,18, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 4 | ISSUE NO : 20 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, July,18, 2026 | PAGES : 8 RS : 4 /- |



త్వరలో ప్లాస్టిక్

## కరెన్సీ నోట్లు

- త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!
- మొదటగా రూ. 10, రూ. వ20 డినామినేషన్లలో పైలట్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ,జూలై17,

దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.





# భారత్‌లో సరికొత్త శకం

## తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలుకు పచ్చజెండా ఊపిన ప్రధాని
- జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం

### రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి

న్యూఢిల్లీ,జూలై17,

స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భా రతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసి ంది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉప యోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. కేవలం నీటి ఆవి రిని మా త్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరి రక్షణకు పెద్దపీట వేస్తుంది. ఈ 10కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామ ర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనహైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్నఅతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

**రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి**

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ. 12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరి కొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ. 9,680 కోట్ల వ్య యంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొ డవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రె స్‌వేను ప్రారం భించారు. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాట కులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

వైద్యం, విద్యే

# ప్రగతికి పెట్టుబడి

- వైద్య, విద్య, ఉద్యోగ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- రికార్డు స్థాయిలో 76 వేల పోస్టులు భర్తీ
- 44 వేలకు పైగా పడకల సామర్థ్యంతో దేశంలోనే అగ్రగామిగా వైద్యరంగం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





హైదరాబాద్, జూలై 17 ,తెలంగాణ దిశ :

వైద్యం, విద్యపై ప్రభుత్వం పెట్టే ఖర్చు ఉచిత సంక్షేమం మాత్రమే కాదని, అది రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచేందుకు మానవ వ నరులపై పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడి అని డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన 247 మంది నర్సింగ్ ఆఫీసర్లకు శుక్రవారం హైదరాబాద్ సేవాలాల్ భవన్‌లో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి నియామక పత్రాలను అందజ ేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మా ట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయ ాం లో కార్మికులు తీవ్ర నిర్లక్ష్యానికి గుర య్యారని, హక్కులు, కనీస వేతనాలకు నోచు కో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గతం లో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రతి బడ్జెట్ సమావేశంలోనూ కనీస వేతనాల సవ రణ గురించి నిలదీశానని, కానీ నాటి ప్రభ ుత్వం ఏనాడూ సరైన సమాధానం ఇవ్వ లేదని గుర్తు చేశారు. అయితే, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బాధ్యతలు చేప ట్టిన వెం టనే ప్రత్యేక దృష్టి సారించి, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను సాధించి జీవోలను విడుదల చేశారని కొనియాడారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో మంద ులల కొరత ఉండకుండా మంత్రి వివేక్ వెంక టస్వామి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుక ొని గ్రీన్ ఛానల్‌లో 30 కోట్లు విడుద ల చేయడానికి వెసలుబాటు కల్పి స్తామని హామీ ఇచ్చారు.



పాకిస్థాన్‌లో కరెంట్

## కష్టాలు

- పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన తీవ్ర విద్యుత్ సంక్షోభం
- సింధ్‌లో విద్యాశాఖ కార్యాలయాల్లో స్తంభించిన కార్యకలాపాలు

ఇంటర్నెట్ న్యూస్,జూలై17

పాకిస్థాన్‌ను తీవ్ర విద్యుత్ సంక్షోభం చుట్టుముట్టింది. గంటల తరబడి కొనసాగుతున్న విద్యుత్ కోతలు ప్రభుత్వ కార్యకలాపాలకు, ప్రజా జీవనానికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సింధ్ ప్రావిన్స్‌లోని విద్యాశాఖ కార్యాలయాలు గత మూడు వారాలుగా కరెంట్ కోతలతో సతమ తమవుతున్నాయి.

# డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కుమారుడు

### ఈ వార్తలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి

హైదరాబాద్,జూలై17,తెలంగాణ దిశ :

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ ఐఏఎస్ అధికారి కె. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డి డ్రగ్స్ కేసులో పోలీసుల విచారణను ఎదుర్కొన్నాడు. పరీక్షల్లో అతడు గంజాయి సేవించినట్లు తేలిందని పోలీసులు పేర్కొంటుండగా, ఈ వార్తలను అతడి తండ్రి వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. డ్రగ్స్ సరఫరాదారుల కా ంటాక్ట్ లిస్టులో భరత్ రాజ్ పేరు ఉండటంతో మం గళహాట్ పోలీసులు జూలై 16న అతడిని విచారణకు పిలిచారు. విచారణలో భాగంగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో అతడు గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.




# ఓటర్ల జాబితా సవరణ

### రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్టు వెల్లడి

హైదరాబాద్,జూలై17,తెలంగాణ దిశ :

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు.





బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో

# హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి
- శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్





హైదరాబాద్,జూలై17,తెలంగాణ దిశ :

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో ని ర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రా మ సభ'కుతెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మం జూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడి యంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేప ట్టిన న్యాయస్థానం, శాంతిభద్రత లకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీ లను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది.



గూగుల్‌కు గట్టి

## ఎదురుదెబ్బ

ఇంటర్నెట్ న్యూస్,జూలై17

గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'జెమినీ 3.5 ప్రో' మోడల్ విడుదల మరికొన్ని నెలలు ఆలస్యమవనుంది. ఈ వార్తలతో పెట్టుబడిదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

# హార్టికల్చర్ హబ్‌కు నిధులివ్వండి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- రొయ్యల మేత ధరలు తగ్గించి, ఆక్వా రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి
- పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్రం దృష్టికి
- రాయలసీమలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు సహకారంపై చర్చ



అమరావతి,జూలై17,తెలంగాణ దిశ :

ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన వినతులు సమర్పించారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని, రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన హార్టికల్చర్ హబ్‌కు సహకరించాలని సీఎం కోరారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, తక్షణం కేంద్రం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం 20 శాతానికి పైగా పెరిగిందని వివరించారు.

# సఫిల్‌గూడ యూపీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆనంద్**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 17, (తెలంగాణ దిశ)** :వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కె.ఆనంద్ సఫిల్‌గూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు. ఓపీ, ల్యాబ్ రిజిస్టర్‌లను పరిశీలించిన ఆయన, నమోదులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఫార్మసీలో మందుల నిల్వలు, బఫర్ స్టాక్, గడువు సమీపిస్తున్న మందుల నిర్వహణను తనిఖీ చేసి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్య సేవలు, గర్భిణీల నమోదు, టీకాల కార్యక్రమాల అమలును మెరుగు పరచాలని సూచించగా, క్షయవ్యాధి కేసుల గుర్తింపు, చికిత్స, డీబీటీ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్న చర్లపల్లి స్మశాన వాటికలో ఇతరులకు స్థలం కేటాయించవద్దు : బిజెపి





**చర్లపల్లి, జూలై 17, (తెలంగాణ దిశ)** :ప్రజల కోసం- ప్రగతి కోసం నిర్వహిస్తున్న "ప్రభాకర్ ప్రజా దర్బార్" కార్యక్రమంలో భాగంగా చిన్న చర్లపల్లి హిందూ స్మశాన వాటికను బిజెపి సీనియర్ నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వివిఎస్ఎస్ ప్రభాకర్ శుక్రవారం సందర్శించారు. ఇక్కడ ముస్లిం, క్రిస్టియన్ వర్గాలకు స్థలం కేటాయించాలనే ప్రతిపాదనపై గ్రామస్థులతో కలిసి అభ్యంతరం వ్యక్తం చేశారు. వందేళ్లకు పైగా హిందూ స్మశాన వాటికగా కొనసాగుతున్న ఈ స్థలంలో ఇతరులకు కేటాయింపులు చేయవద్దని, వారికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని అధికారులను డిమాండ్ చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టించవద్దని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న చర్లపల్లి గ్రామస్థులు, పరిసర కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- బీఎల్‌వోలకు కలెక్టర్ మను చౌదరి ఆదేశాలు**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 17, (తెలంగాణ దిశ)** :జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి బీఎల్‌వోలకు సూచించారు. శుక్రవారం అల్వాల్ మండలంలోని 9వ నంబర్ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, ఫారాల పంపిణీ, స్వీకరణతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ అవగాహన కల్పించాలని, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను వెంటనే సూపర్ వైజర్లకు అందించాలని ఆదేశించారు. రోజువారీ లక్ష్యాలను పూర్తి చేస్తూ సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని బీఎల్‌వోలకు కలెక్టర్ సూచించారు.

# యువత హక్కుల కోసమే నేడు యువ సంగ్రామ సదస్సు

**- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఏఎస్ రావునగర్, జూలై 17, (తెలంగాణ దిశ)** :డాక్టర్ ఏఎస్ రావునగర్ లోని ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.

సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం జరిగే సభకు విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత సమస్యలపై గొంతు వినిపించే వేదికగా ఈ సదస్సు నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.



# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు!

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శ లు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కించడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించిం ది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించారంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. సరిగ్గా యాభైయేళ్ళ క్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది.

### ఇంటర్మీడియట్ లో జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీ : విద్యాశాఖ ఉత్తర్వులు

# టీఎస్ జెయు కృషితో ఇంటర్ విద్యలో రాయితీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 17, (తెలంగాణ దిశ)** : తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) విజ్ఞప్తి మేరకు జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యలో ఫీజు రాయితీ కల్పిస్తూ విద్యాశాఖ అధికారులు ప్రొసీడింగ్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ..జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ యూనియన్ నిరంతరం శ్రమిస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్మీడియట్‌స్థాయిలోనూ రాయితీ సాధించడం కేవలంటీఎస్ జెయు ద్వారానే సాధ్యమైందని పేర్కొన్నారు. నిత్యం వార్తా సేకరణలో నిమగ్నమయ్యే విలేకరుల కష్టాన్ని గుర్తించి ఈ ఉత్తర్వులు జారీ చేసినందుకు జిల్లా కలెక్టర్ మను చౌదరి, విద్యాధికారి రేణుక దేవి, ఇంటర్మీడియట్ అధికారి కిషన్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


# ఎలక్ట్రికల్ ఛార్జింగ్ పాయింట్ వెంటనే నిలిపివేయాలి

## - ఆనంద్ నగర్ కాలనీ ప్రాంత ప్రజల డిమాండ్



**చిల్కానగర్, జూలై 17, (తెలంగాణ దిశ) :** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ ఆనంద్ నగర్ కాలనీలోని నివాస ప్రాంతంలో ఎలక్ట్రికల్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయొద్దని ఆనంద నగర్ కాలనీ ప్రాంత ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆనంద్ నగర్ కాలనీ అధ్యక్షులు వంగాల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ నివాస సముదాయాలలో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి ప్రజలకు అనేక ఇబ్బందులు, సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎలక్ట్రికల్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్ ఏర్పరిచే స్థలమునకు సరైన రోడ్డు మార్గం కూడా లేదు అని చెప్పారు. ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ పాయింట్ యజమాన్యులైన ఆనంద్ చందక్ మరియు మహేష్ చందక్ లకు వివరించామని, దానికి వాళ్లు అక్కడున్న ప్రజలు, మహిళలపై దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. అంతేకాకుండా ప్రజలు నివాసం ఉండే ప్రాంత సముదాయాలలో హై వోల్టేజ్ ఎలక్ట్రిక్ పాయింట్లను అమర్చడం చాలా ప్రమాదకరమని తెలిపారు. ప్రతినిత్యం పిల్లలతో, మహిళలతో రద్దీగా ఉండే నివాస ప్రాంతంలో హై వోల్టేజ్ ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరమని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు. దీనిని సంబంధిత అధికారులు పరిశీలించాలని వెంటనే ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రెటరీ సదుగు భాస్కర్ రెడ్డి ఉపాధ్యక్షులు అయిలి మధు గౌడ్, జగన్మోహన్ రెడ్డి, బిక్షపతి, రఘుపతి గౌడ్, కళాపతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాకు ఆక్వా ప్రొడక్ట్స్



విజయవాడ,: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు చెబితేనే ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. పన్నులు పెంచి ప్రపంచ దేశాలను కోలుకోలేని దెబ్బతీశారు. ఆ దేశానికి ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వస్తువుల పై భారీగా సుంకం పెంచి ప్రపంచంలో చాలా దేశాలను ఇబ్బంది పెట్టారు. అందులో బాధిత దేశంగా ఇండియా ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ పెంచిన సుంకాలతో మన దేశంపై పెద్ద ప్రభావమే పడుతోంది. ముఖ్యంగా ఆక్వారంగం కష్టాల్లో పడింది. రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఏపీ మంత్రి నారా లోకేష్ చతురతతో వ్యవహరించారు. అమెరికా ద్వారా జరిగిన నష్టాన్ని ఆస్ట్రేలియాతో బత్తి చేయడంలో లోకేష్ సక్సెస్ అయ్యారు. ఇది నిజంగా ఏపీలోని ఆక్వారంగానికి ఉపశమనం కలిగించే విషయమే.అగ్రరాజ్యం అమెరికాకు ఏపీ నుంచి ఆక్వా ఉత్పత్తులుఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. మొత్తం 100% ఉత్పత్తుల్లో 90 శాతం అమెరికాకే తరలిస్తుంటారు. అయితే ఆక్వాపై అమెరికాలో సుంకాలు పెంచడంతో.. ఏపీలో వాటికి సంబంధించిన ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆక్వాతో పాటు పదిరకాల అనుబంధ రంగాలపై కూడా ఇది ప్రభావం చూపింది. ఒక్కసారిగా రొయ్యల ధరలు సైతం పతనం అయ్యాయి. వాస్తవానికి మన రొయ్యలు జపాన్, చైనా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే అమెరికాకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులపై సుంకం విధించడంతో అక్కడ డోర్ క్లోజ్ చేసినట్లు అయింది. దీంతో దేశీయ మార్కెట్ రంగంపై ఏపీ ఆక్వా ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జపాన్‌తో పాటు చైనాకు పరిమిత స్థాయిలోనే ఎగుమతులు అవుతున్నాయి. ఇటువంటి సమ యంలో ఆస్ట్రేలియా ఏపీ ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు ముందుకురావడం శుభ పరిణామం. దీనివెనుక మంత్రి నారా లోకేష్ కృషి ఉంది. ఆస్ట్రేలియా ఆక్వారంగా అధికారులు, ప్రతినిధులు తో సమావేశం అయినలోకేష్ వారినిఒప్పించగలిగారు.ఆస్ట్రేలియా గతం లో భారత్ నుంచి రొయ్యలను దిగుమతి చేసుకునేది. అయితే వైట్ స్పాట్ వైరస్ రొయ్యలు కావడంతోభారత్ నుంచిదిగుమతులను రద్దు చేసుకుంది. అప్పటినుంచి మన రొయ్యలపై ఆస్ట్రేలియాలో నిషేధం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రతినిధులతో లోకేష్ సమావేశం అయ్యారు. ఏపీ ఆస్ట్రేలియా మధ్య ఆక్వా ఎగుమత్తుల అంశంపై వారితో చర్చించా రు. ఏపీలో ఈ రంగం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. 2027 అక్టోబర్ 20 వరకు భారతీయ రొయ్యలను ఆస్ట్రేలియా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించింది. ఈ మేరకు అక్కడి ప్రతినిధులు ఆమోదం తెలిపిన డాక్యుమెంట్లను జతచేస్తూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఏ ఏ రకాల రొయ్యలు? ఎంత ధరకు దిగుమతి చేసుకుంటారు? అన్న వివరాలను ఆ పత్రాలలో ప్రస్తావించారు.నారా లోకేష్ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.' భారతదేశ నుంచి ఆస్ట్రేలియాకు రొయ్యల ఎగుమతుల్లో ఒక పెద్ద అడ్డంకి తొలగిపోయింది. గతంలో తెల్ల మచ్చ వైరస్ ఉన్న రొయ్యలను తొక్క తీయకుండా ఆస్ట్రేలియా దిగుమతి చేసుకోలేదు. కానీ ఇప్పుడు భారత్ నుంచి వచ్చే ఆ రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది. ఈ విజయం వెనుక భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వా ల కృషి ఎంతో ఉంది. వారికి నా కృతజ్ఞతలు. ఒకే మార్కెట్ పై ఆధారప డకుండా.. కొత్త మార్కెట్లను ఓపెన్ చేయడం చాలా ముఖ్యం ' అన్నారు మంత్రి నారా లోకేష్. వాస్తవానికి ఆస్ట్రేలియాతో పాటు సౌదీ అరేబియాలో మన రొయ్యలకు గిరాకీ ఉంది. అయితే తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం అంగీకారం తెలపడంతో సుమారు 8వేల కంటైనర్ల రొయ్యలను ఎగుమతి చేసే అవకాశం ఉంది.

### విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు!

భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవ లసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థారులాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొచ్చినప్పుడు ఆ అభ్యర్థనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు.

# సంపాదకీయం

## ఇండియా ఆపరేషన్ సముద్ర

చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది.అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అతి త్వరలోనే సముద్రయాన్ ప్రాజెక్టుతో సముద్రపు లోపల ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు కీలక ప్రయోగం చేపట్టనుంది.. రెండేళ్ల క్రితమే సముద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో అనౌన్స్ చేసింది.. అందుకోసం ప్రత్యేక సబ్ మెరైన్ ను రూపొందించింది. సముద్రయాన్ మిషన్ అనే ప్రయోగం ద్వారా మహా సముద్రాల అన్వేషణలో భాగంగా సముద్రాల లోపల ఉన్న ఖనిజ సంపదను అన్వేషించడానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి మహా సముద్రాలలో ఉన్న ఖనిజ సంపదను కనుగొనేందుకు మత్స్య 6000 అనే సబ్ మెర్సిబుల్ మిషన్ ద్వారా చెన్నై తీరంలోని 5 వేల మీటర్ల లోతులో ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టారు. ఆ తర్వాత మరింత లోతులో పరిశోధనలు చేపట్టనుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలుపెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నై ఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 600 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెడతారు.డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వా నాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు. సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రయోగం విజయవంతం అయితే 2026 లేదా 2027 చివరిలో మానవ సహిత సముద్రయాన్ ప్రాజెక్ట్ ను ఇస్రో జరుపనుంది. 28 టన్నులు బరువు కలిగిన మత్స్య 6000 అనే సబ్ మెరైన్ మిషన్ ద్వారా ఈ ప్రాజెక్ట్ ను జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ ద్వారా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పర్యవేక్షణలో సముద్రయాన్ మిషన్ ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో మానవ సహిత గా ముగ్గురు శాస్త్రవేత్తలను ఎంపిక చేసి ఇందులో ప్రయాణించనున్నారు.అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టే శాస్త్రవేత్తలను ఆస్ట్రోనాట్స్ గా పిలుస్తారు. సముద్రం లోపల పరిశోధనలు చేసే వాళ్లను ఆక్వానాట్స్ గా పిలుస్తారు. ఫ్రాన్స్ సహకారంతో భారత్ సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతుంది. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సబ్ మెరైన్ లో వెళ్లి పరిశోధన చేస్తారు. అందులో ఇద్దరు భారత కు చెందిన శాస్త్రవేత్తలు ఇప్పటికే పరిశోధనలు మొదలుపెట్టారు. వారిలో జితేంద్ర పాల్ సింగ్, రాజు రమేష్ లు ఇప్పటివరకు 5000 మీటర్ల లోతు వరకు డైవ్ చేసిన భారత్ రికార్డుగా ఈ ప్రయోగం ద్వారా సాధించారు. ఈ సబ్మెర్సిబుల్ 12 గంటల పాటు పనిచేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు కూడా సముద్రంలో ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రయోగం ద్వారా సముద్రంలో ఉన్న ఖనిజాలు, ఖనిజ సంపద,మినరల్స్, కోరల్స్ వంటి ఖనిజాలతో పాటుగా సము ద్రంలో ఉన్న ఇసుకలో కూడా ఏతరహా ఖనిజాలు ఉన్నాయి.. వాటి ఉపయోగాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు.ఈ తరహా ప్రయోగాలను ఇప్పటివరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, చైనా లాంటి దేశాలు మాత్రమే చేశాయి.. ఇప్పుడు ఇస్రో కూడా ఈ దేశాల సరసన చేరనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఇస్రో ఒకవైపు గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమవుతూ నే సముద్రం లోపల శాస్త్రవేత్తల ద్వారా అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగ ప్రక్రియను పూర్తిచేసే దశలో ఉండటం గర్వకారణమ నిపలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా భారత ఆర్థిక ముఖ చిత్రంపూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందినదేశంలాకాకుండా..అభివృద్ధి చెందిన దేశంగా రూపాం తరంచెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశా ల కు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

# ఇరాన్‌పై పోరు.. పెద్దన్నకు బేజారు



ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా–ఇజ్రాయిల్ దుష్ట కూటమి ఇరాన్‌పై ప్రారంభించిన దాడులకు ముందు వారు అనుకున్నది ఒకటి. అయింది, అవుతున్నదీ మరొకటి. ఉన్మాదంతో ట్రంప్ ఏం మాట్లాడుతున్నాడో, ఏం చేస్తున్నాడో చూస్తున్నాం. ఇది రాస్తున్న సమయానికి హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోయినా దాడులను ముగించాలనుంది అన్నట్లుగా వార్తలు వచ్చాయి. అయినప్పటికీ భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దాడులు ఐదవ వారంలో ప్రవేశించాయి. కాల్పుల విరమణ చర్చల సంగతి ఎటూ తేలలేదు, అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పింది. పరిస్థితి ఇలా ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు (డాలరకు 95 రూపాయలు) ఖర్చు అవుతున్నాయి. ప్రపంచం 1970 దశకం నాటి స్టాగ్‌ఫ్లేషన్‌కు (ఆర్థికరంగం గిడసబారటం, ధరలు, నిరుద్యోగం పెరుగుదల దీని లక్షణాలు) గురవుతుందా అని కొందరు సందేహి స్తుండగా పరిస్థితి తీవ్రంగా ఉంది తప్ప అలాంటి అవకాశం లేదని మరికొందరంటున్నారు. అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడు సార్లు అక్కడి కార్మికవర్గం రాజులు లేరు, రాజరికాలు లేవు అంటూ ట్రంప్‌నకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేశారు. తొలిసారి 50, రెండవసారి 70, మూడవసారి 90 లక్షల మంది పాల్గొన్నారు. మూడ వసారిమార్చి చివరివారంలో జరిగిన ప్రదర్శనల్లో అమెరికాలో జరిగిన రోజునే వివిధ ఖండాలలోని పన్నెండు దేశాలలో కార్మికులు స్థానిక సమస్యలను తీసుకొని ప్రదర్శనలు జరపటంవిశేషం. అమెరికా విని యోగదారులపై భారం ఎలా పడిందంటే ఫిబ్రవరి నెలలో జాతీయ సగటుగ్యాస్ ధర 2.98 డాలర్లు ఉంటే ఆదివారం నాడు అది 3.98 డాలర్లు ఉంది. సరఫరా, ధరల నియంత్రణలో భాగంగా 32 దేశాలు, 13 సహదేశాలు (వీటిలో మన దేశం లేదు) సభ్యులుగా ఉన్న అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఏ) తన పర్యవేక్షణలో ఉన్న 120 కోట్ల పీపాల చమురులో 40 కోట్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఆ సంస్థ నిబంధన ప్రకారం ప్రతి సభ్యదేశం 90 రోజులకు సరిపడా చమురు ఉత్పత్తులను నిల్వ చేసుకోవాలి. ఈ యుద్ధం ప్రపంచ చమురు మార్కెట్ చరిత్రలో సరఫరా విచ్ఛిన్నంలో అతి పెద్దదని ఆ సంస్థ పేర్కొన్నది. దీనికి ట్రంప్ బాధ్యుడని వేరే చెప్పనవసరం లేదు.

ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటివిలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. అమెరికాలో జతకూర్చిన సమాచారం ప్రకారం ఒక్క రోజులో ఎస్ అండ్ పి 500 సూచిక 1.66 శాతం పతనంతో ఒక లక్ష కోట్ల డాలర్లు, నాస్‌డాక్ 2.09 శాతం పతనంతో ఆరు వందల బిలియన్ డాలర్లు, డౌ సూచిక 1.2 శాతం పతనం 300 బి. డాలర్లు మొత్తం ఒక్క రోజులో 1.2 లక్షల కోట్ల డాలర్లు ఆవిరైంది. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. అమెరికాలో ఉత్పత్తి అయ్యే డబ్ల్యుటిఐ రకం ముడి చమురు ధర 2025 డిసెంబరులో 57 డాలర్లు ఉంటే ఇది రాసిన సమయంలో 102 డాలర్లు ఉంది. దీనికి అనుగుణంగానే అమెరికాలో ధరలు పెరిగాయి. ఫిబ్రవరిలో విమాన ఇంధనం పీపా ధర 99 డాలర్లు ఉంటే మార్చి నెల 20న 197 డాలర్లకు పెరిగింది. స్లోక్ అనే ఆర్థికవేత్త జనవరిలో అమెరికా ఆర్థిక స్థితి గురించి ఆశాభావం వెలిబుచ్చాడు. ఎప్పుడైతే ట్రంప్ యుద్ధాన్ని ప్రారంభించాడో ఇప్పుడా పెద్దమనిషి స్టాగ్‌ఫ్లేషన్ అవకాశాల గురించి హెచ్చరించాడు. ముందే చెప్పుకున్నట్లు డోనాల్డ్ ట్రంప్ అనుకున్నది ఒకటి. జరుగుతున్నది మరొకటి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు. పెట్రో డాలర్‌ను సవాలు చేస్తూ చైనా యువాన్‌తో లావాదేవీలు జరిపేవారి నౌకలను హోర్ముజ్ జలసంధి నుంచి అనుమతిస్తామని అది ప్రకటించింది. ఆ కరెన్సీలోనే అది కప్పం వసూలు చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇరాన్ యుద్ధం చైనా పెట్రో యువాన్‌కు శక్తినిస్తుందని అమెరికా డాలర్ ఆధిపత్యం బలహీనపడుతుందని ఈ పరిణామాల గురించి హాంకాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మోర్నింగ్ పోస్ట్ పత్రిక వ్యాఖ్యానించింది. ఇతర దేశాలను తన అదుపులో ఉంచుకొనేందుకు తనకు అనుగుణంగా ఆడించేందుకు ఉక్కిరి బిక్కిరి చేసే అంశాలుగా ప్రపంచంలోని చమురు సంపద, ఇతర వనరులను వినియోగించుకొనేందుకు వాటి మీద అదుపు సాధనకు అమెరికా ఎప్పుడో ఎత్తువేసింది. ఇప్పుడు అనూహ్యంగా గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ అదే పాత్ర పోషించాలని చూస్తోంది. సూయజ్ కాలువ ద్వారా మధ్యధరా సముద్రంలో ప్రవేశించిందేకు పర్షియా గల్ఫ్–ఎర్ర సముద్రాన్ని అనుసంధానం చేసే అల్ మండాబ్ జలసంధిని కూడా ఎమెన్ ద్వారా తన అదుపులోకి తెచ్చుకుంటామని హెచ్చరించింది. అదే జరిగితే ఐరోపా దేశాలను కూడా అది ఒక ఆట ఆడించగలదు. అమెరికా అనుసరిస్తున్న మొరటు సూత్రం ఒక్కటే. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారు. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రాంతమైన గాజాలో చేసింది అదే. ఆసుపత్రులు, స్కూళ్లు, సహాయ కేంద్రాలు వేటినీ వదలకుండా నాశనం చేసింది. 70 వేల మందికి పైగా పిల్లలు, మహిళలను చంపివేసింది. ఆ ప్రాంతాన్ని మరుభూమిగా మార్చింది. అయినప్పటికీ హమాస్‌గానీ, పాలస్తీనియన్లుగానీ ఇజ్రాయిల్‌కు లొంగలేదు. ఇప్పుడు ఇరాన్ కూడా యావత్ ప్రపంచానికి అదే సందేశమిచ్చింది. మీ మీద దాడి చేసే ఉద్దేశం మాకు లేదు, మీ అధినేత అయాతుల్లా అలీ ఖమేనిని పదవి నుంచి తొలగిస్తే మీకు రక్షణ కల్పిస్తాం, లేకపోతే దాడులు చేస్తాం అని మెరికా తొలి రోజుల్లో బెదిరించింది. ఆడపిల్లలు చదుకొనే పాఠశాల మీద అమెరికా విమానాలు బాంబులు వేసిన దుర్మార్గం గురించి తెలిసిందే. ఇప్పుడు వేరేగా మాట్లాడుతోంది. మార్చి 31, ఒకటవ తేదీల్లో చైనా సందర్శించాలని ట్రంప్ కార్యక్రమం నిర్ణయించుకున్నాడు. చైనా పర్యటన ఎప్పుడో ఖరారైంది గనుక ఈలోగా ఇరాన్‌ను దెబ్బ తీసి దాన్నే చైనా ముందు ప్రదర్శించాలన్న దుష్టాలోచనతోనే ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించినట్లు చెప్పవచ్చు. అయితే ట్రంప్‌నకు ఇరాన్ చుక్కలు చూపించింది. దాంతో మార్చి నెలాఖరులో చైనా పర్యటనను వాయిదా వేసుకున్నాడు. మే నెల 14,15 తేదీల్లో వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. జరుగుతున్న పరిణామాలను బట్టి అది కూడా జరుగుతుందా వాయిదా పడుతుందా అన్నది చూడాల్సి ఉంది.

## మారుతున్న మైండ్‌సెట్..

# ఏఐ స్కిల్స్‌పై ఇంజినీర్ల ఫోకస్



**దేశంలో ప్రతి 10 మందిలో 8 మందిది ఇదే ధోరణి**

**షార్ట్ టర్మ్ కోచింగ్ వైపు 66 శాతం మంది ఆసక్తి**

**'ఎడ్‌టెక్ ఫర్మ్ గ్రేట్ లెర్నింగ్' అధ్యయనంలో వెల్లడి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఐటీ ఉద్యోగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తెచ్చిన గుణాత్మక మార్పులకు అనుగుణంగా ఇంజినీర్ల మైండ్‌సెట్ మారుతున్నది. దీంతో ఏఐ స్కిల్స్ నేర్చుకోవడంపై ఫోకస్ చేసినట్టు తాజా అధ్యయనం వెల్లడించింది. దేశంలో 67% మంది ఇంజినీర్లు ఏఐ స్కిల్స్ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తాజా సర్వే పేర్కొన్నది. 'ఎడ్‌టెక్ ఫర్మ్ గ్రేట్ లెర్నింగ్' తాజా అధ్యయనం వివరాలు వెల్లడించింది. ప్రతి 10 మంది ఇంజినీర్లలో 8 మంది ఏఐ స్కిల్స్ నేర్చుకోవడంపై దృష్టి సారించినట్టు పేర్కొన్నది. 'ఇంజినీర్స్ డే'ను పురస్కరించుకుని ఈ రిపోర్టును సదరు సంస్థ రిలీజ్ చేసింది. టెక్నాలజీలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా కెరీర్‌ను తీర్చుదిద్దుకునేందుకు యువత మొగ్గు చూపుతున్నట్టు రిపోర్టు స్పష్టంచేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో 85% మంది ఇంజినీర్లు 2026 నాటికి ఏఐ స్కిల్స్ నేర్చుకోవాలని ప్లాన్ చేసుకుంటున్నట్టు పేర్కొన్నది. ఇంజినీర్లు ప్రస్తుతం నేర్చుకోవాలనుకుంటున్న టాప్ లిస్టులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మిషన్ లెర్నింగ్(ఎంఎల్) మొదటి స్థానంలో ఉన్నట్టు రిపోర్టు తెలిపింది. ఇందులో జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ, పైథాన్ ప్రోగ్రామింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రొసెసింగ్(ఎన్ఎల్పీ)కు డిమాండ్ ఉండగా.. వీటిలో నైపుణ్యం సాధించే ఇంజినీర్లు కసరత్తు చేస్తున్నట్టు అధ్యయనం పేర్కొన్నది. ఏఐ స్కిల్స్ ఉంటే ఉజ్వల భవిష్యత్తు: స్కిల్స్ పెంపొందిం చుకోవడం ద్వారా కెరీర్‌లో ఎదుగుదల(45%), ఆర్థికాభివృద్ధి(20%), ప్రమోషన్లు(12%) కొత్త ఉద్యోగ అవకాశాలు(12%) చోటు చేసుకుంటున్నట్టు అధ్యయనం వెల్లడించింది. నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా స్కిల్స్‌లో వెనకబాటు(11%) తగ్గుతున్నట్టు తెలిపింది. అయితే స్కిల్స్ పెంపొందించుకునేందుకు 66% మంది ఇంజినీర్లు షార్ట్ టర్మ్ కోచింగ్ వైపు ఆసక్తి చూపుతున్నట్టు తెలిపింది. కేవలం 5% మంది ఏడాదికిపైగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్నట్టు అధ్యయనం వెల్లడించింది. అనేక మంది ఇంజినీర్లు మన దేశంతోపాటు అంతర్జాతీయ యూనివర్సిటీల నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందేందుకు ఆసక్తి కనబరస్తున్నట్టు తెలిపింది. ఈ మార్పు ఐటీ రంగంలో స్కిల్స్‌కు ఉన్న ప్రాముఖ్యతను స్పష్టం చేస్తున్నది. ఇక ఏఐతో వచ్చిన మార్పులతో దేశంలో 85% మంది ఇంజినీర్లు ఈ ఏడాది ఉద్యోగాలు మారినట్టు అధ్యయనం వెల్లడించింది. ఇందులో 33% మంది వర్క్‌లైఫ్‌ను బ్యాలెన్స్ చేసేందుకు జాబ్ మారగా, ఉద్యోగ భద్రత కోసం 18% మంది, కెరీర్‌లో వెనకబడొద్దని మరో 14% మంది ఉద్యోగం మారినట్టు పేర్కొన్నది. అయితే కేవలం డిగ్రీలు, కోర్సుల సర్టిఫికెట్ల ఆధారంగా కాకుండా.. ఏఐపై ఎవరు పట్టు సాధిస్తారో వారికే ఉద్యోగ అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయని, వారికే తొందరగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. ఏఐ టెక్నాలజీని నేర్చుకున్న వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు ఉంటాయని వారంటున్నారు.

జాబ్ చేస్తున్న వారు సైతం ఏఐలో స్కిల్స్ నేర్చుకోవాలి: ఇప్పటికే ఐటీ ఉద్యోగాలు చేస్తున్నవారు ఏఐలో నైపుణ్యాలు పెంచుకోవాలి. గూగుల్ సైతం తమ కంపెనీలో ఉద్యోగులకు ఏఐ నేర్చుకోవాలని తాజాగా ఆదేశాలు జారీచేసింది. భవిష్యత్తులో ఏఐలో స్కిల్స్ ఉన్న వారికే మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ఏఐతో వస్తున్న మార్పులకు అనుగుణంగానే ప్రభుత్వాలు ఏఐ సిటీలు నిర్మిస్తున్నాయి. కేవలం ఐటీ అని కాకుండా మిగతా రంగాలపై కూడా భవిష్యత్తులో ఏఐ ప్రభావం ఉంటుంది. అయితే ఇప్పుడే ఏఐ కారణంగా ఎంత మంది ఉద్యోగాలు పోతాయని చెప్పలేం. ఏఐలో చాలా అడ్వాన్స్‌డ్ టూల్స్ వచ్చాయి.

# వ్యవసాయ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు..?

**మహబూబ్ నగర్,తెలంగాణ దిశ :**తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల అక్రమాల విచారణ రెవెన్యూ అధికారులను కలవరపెడుతోంది. 2021–2025 మధ్య కాలంలో జనగామ, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు ఇప్పుడు ఏసీబీ విచారణకు భయపడుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన లావాదేవీల్లో చలానాల మాయాజాలం, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులకు నోటీసులు జారీ కాగా.. సంక్రాంతి తర్వాత అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అక్రమాల విచారణ ఇప్పుడు రెవెన్యూ శాఖలో పెను తుపానును సృష్టిస్తోంది. ప్రధానంగా భూముల క్రయవిక్రయాల్లో జరిగిన లావాదేవీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడంతో.. గతంలో కీలక జిల్లాల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు వణికిపోతున్నారు.ముఖ్యంగా 2021 నుండి 2025 మధ్య కాలంలో జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ విచారణ కమిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా సభ్యులుగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో తాము చేసిన భూముల బదిలీలు లేదా రిజిస్ట్రేషన్లలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో సిబ్బంది ఆరా తీస్తున్నారు.ఈ కేసు ఒక ప్రాంతానికో లేదా ఒక అధికారికి సంబంధించినది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో అనేక లోపాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లు తప్పుడు చలానాలను సృష్టించడం లేదా ఒకే చలానాను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విచారణలో భాగంగా ఇప్పటికే అనేకమంది భూ యజమానులకు, రైతులకు రెవెన్యూ శాఖ నోటీసులు పంపింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతి రిజిస్ట్రేషన్ లావాదేవీని క్షుణ్ణంగా ఆడిటింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా లావాదేవీల్లో తేడాలు వచ్చిన వివరాలను నేరుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు.ప్రస్తుతానికి ప్రభుత్వం నియమించిన కమిటీ కేవలం ఆధారాల సేకరణలో నిమగ్నమై ఉంది. తర్వాత ఈ విచారణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. పోలీసులు ఇప్పటికే కొందరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండటంతో.. వారిచ్చే సమాచారం ఆధారంగా రెవెన్యూ అధికారులకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆడిటింగ్‌లో 90 శాతం నివేదికలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. కొన్ని చోట్ల చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టే స్థాయిలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

## దేశం నుంచి పారిపోవడానికి..

# పదేండ్లుగా ప్రణాళిక!

### ఎట్టకేలకు ఉత్తర కొరియా నుంచి తప్పించుకున్న ఓ కుటుంబం



సియోల్: ఉత్తర కొరియా.. ఈ పేరు వింటేనే ఒక నియంత.. కఠిన నిబంధనలు, ఆంక్షలు.. అగ్రరాజ్యం అమెరికాను సైతం భయ పెట్టేలా అప్పుడప్పుడు క్షిపణి ప్రయోగాలు మనకు గుర్తుకు వస్తుంటాయి. ఎన్నో కఠిన ఆంక్షలు ఉన్న ఆ దేశం నుంచి ఒక కుటుంబం విజయవంతంగా తప్పించుకున్న వైనాన్ని సీఎన్ఎన్ వెల్లడించింది. అయితే ఇది రాత్రికి రాత్రేమీ జరిగిపోలేదు. దాని కోసం ఆ కుటుంబం 10 ఏండ్ల పాటు వేసిన ప్రణాళికలు, దానిని అమలు చేసేందుకు పన్నిన పథకాలు ఏ హాలీవుడ్ సినిమాకు తీసిపోని విధంగా ఉన్నాయి. కిమ్ఇల్ హ్యోక్ అనే వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని ఉత్తర కొరియా నుంచి తన కుటుంబంతో సహా పారిపోవాలని అనుకున్నాడు. దాని కోసం 10 ఏండ్లుగా ప్రణాళికలు వేస్తూ దశలవారీగా అమలు చేయడం ప్రారంభించాడు. సాధారణంగా దేశం నుంచి పారిపోయే వారు నదిని దాటి చైనాలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తుంటారు. ఇది అత్యంత సాధారణ మార్గం. కానీ చైనాలో దొరికితే తిరిగి ఉత్తర కొరియాకు పంపే ప్రమాదం కూడా ఉంది. కానీ కొందరు కొరియన్ డీమిలిటరైజ్డ్ జోన్ (డీఎంజెడ్) ద్వారా దక్షిణ కొరియా వెళ్లడానికి ప్రయత్నిస్తారు. సైన్యం, మైన్స్, గన్స్‌తో ఉండే ఇది చాలా ప్రమాదకరం. కిమ్ఇల్ హ్యోక్ ఈ మార్గాన్నే ఎంచుకున్నాడు. 2023 మేలో వారు అత్యవసరంగా దేశం నుంచి తప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి కూడా సహకరించిందన్నట్టుగా, ఆ రోజు రాత్రి భారీ వర్షం కురవడం ప్రారంభించింది. దీంతో వారు ఆ వానలోనే ఒక చేపల పడవలో ప్రయాణం ప్రారంభించారు. ఒక గార్డుకు లంచం ఇచ్చి ఎల్లో సీలో చేపల వేటకు అనుమతి పొందారు. కిమ్ భార్య, అతని తల్లి, అతని వదిన, హ్యోక్ అత్త పడవలో గోనెసంచుల అడుగున కదలకుండా పడుకున్నారు. తర్వాత ఆ పడవ తీరం నుంచి దూరంగా వెళ్లిపోయింది. ఆ సమయంలో తమ గుండె పడవ ఇంజన్ కన్నా గట్టిగా కొట్టుకుందని కిమ్ తర్వాత పేర్కొన్నారు. సుమారు రెండు గంటల తర్వాత సముద్ర సరిహద్దు జలాల వద్దకు చేరుకున్నారు. అక్కడ కనుక ఉత్తర కొరియా పెట్రోలింగ్ సిబ్బందికి దొరికారో వారిని చంపడమో, జీవితాంతం జైలులో వేయడమో చేసేవారు. అయితే అదృష్టం వారివైపు ఉంది. మెల్లిగా వారి పడవ ఉత్తర పరిమితి రేఖను దాటింది. తర్వాత వారు దక్షిణ కొరియాలోని యెన్ప్యోంగ్ ద్వీపానికి చేరుకున్నారు. దక్షిణ కొరియా నావికా సిబ్బంది వారిని తొలుత అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఉత్తర కొరియా నుంచి వచ్చినట్టు నిర్ధారించుకుని ఆశ్రయం కల్పించారు.

# పామును పసిగట్టే పరికరం!



న్యూఢిల్లీ,: గ్రామీణ భారతంలో పాము కాటు మరణాలను నివారించే లక్ష్యంతో కిసాన్ మిత్ర ఛడీ అనే కొత్త ఎలక్ట్రానిక్ పరికరం అందుబాటులోకి వచ్చింది. వెలుగు తక్కువగా ఉండే ప్రాంతాల్లో తరుచూ పనిచేసే రైతులు పాముకాటుకు గురికావడం దేశంలో సర్వసాధారణంగా మారిపోయింది. గ్రామీణ భారతంలో ముఖ్యంగా వ్యవసాయ కూలీలు ఎక్కువ పనిచేసే ప్రదేశాల్లో పాముకాటు అనేది ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతున్నది. కాగా తక్కువ ఖర్చుతో లభించే సాంకేతిక పరిష్కారాలు పాము కాటు ముప్పును తగ్గించి వ్యవసాయ పనుల్లో ఆరోగ్య భద్రతను మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి. దాదాపు 5 నుంచి 15 మీటర్ల దూరంలో దాగి ఉన్న సర్పాన్ని కూడా వైబ్రేషన్ టెక్నాలజీతో పనిచేసే కిసాన్ మిత్ర ఛడీ అనే ఈ పరికరం కనిపెడుతుంది. 100 మీటర్ల దూరంలో ఏదైనా సర్పం ఉంటే వెంటనే గట్టి వైబ్రేషన్ ద్వారా రైతుకు సిగ్నల్ ఇస్తుంది. రాత్రుళ్లు పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు పాము కాట్లకు గురికాకుండా నివారించడమే ఈ పరికరం ప్రధాన ఉద్దేశం. కిసాన్ మిత్ర ఛడీ అనే ఈఎలక్ట్రానిక్ కర్రను భారతీయ శాస్త్రవేత్తలు రూపొం దించారు. ఇది పాము కదలికలపై రైతులను ముందుగానే అప్రమత్తం చేస్తుంది. కేంద్ర వ్యవసాయ మంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ అధికారికంగా ఈ పరికరం పనితీరు గురించి వివరించారు. ముందు గా రైతు ఈ కర్రను నేలలో పాతి బటన్‌ని నొక్కాలి. వెంటనే పరిసరాల్లో (100 మీటర్ల దూరంవరకు) కదలికలను ఈ కర్ర స్కాన్ చేస్తుంది. ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ లేదా నిర్దిష్టమైన వైబ్రేషన్ ఫ్రీక్వెన్సీల ద్వారా పామును గుర్తిస్తుంది. పామును గుర్తించిన తర్వాత కర్ర గట్టిగా వైబ్రేట్ అవుతుంది. దీంతో రైతు పాముబారిన పడకుండా తప్పించుకో వచ్చు. ప్రమాదవశాత్తు పాము కాటుకు గురై ఏటా కొన్ని వేల మంది మరణిస్తున్న దృష్ట్యా ఈ మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడా నికి ఈ కర్ర ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఈ పరికరంలో ఉండే సెన్సార్లు పాము కదలికలు, దాని బుసను ఆధారం చేసుకుని రైతులను అప్రమత్తం చేయగలవని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రిసెర్చ్ అండ్ ఇంజినీరింగ్ డెవలప్‌మెంట్ వివరించింది.

# అమెరికాను వీడుతాం..

### 40 శాతం మంది భారతీయుల అభిప్రాయమిదే



వాషింగ్టన్, : ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో అమెరికాకు వెళ్లిన ప్రవాస భారతీయుల కలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టింది మొదలు అక్కడి ప్రవాస భారతీయులకు కష్టాలు మొదలయ్యాయి. 40 శాతం మంది భారతీయ అమెరికన్లు ఆ దేశాన్ని వీడాలని భావిస్తున్నట్టు తాజా సర్వే ఒకటి వెల్లడించింది. అమెరికాలో భారత సంతతి ప్రజలు 52 లక్షల మంది నివసిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీళ్లందరిలో 'అమెరికా డ్రీమ్' కనుమరుగు అవుతున్నదని సర్వే అభిప్రాయపడింది. ఈ మార్పునకు ప్రధాన కారణం అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణమే. 'కార్నెగీ ఎండోమెంట్' తాజా సర్వేలో భాగంగా.. 1,000 మంది నుంచి సేకరించిన అభిప్రాయాలు విశ్లేషించగా, అమెరికాను వీడాలని తరచూ ఆలోచిస్తున్నామని 14 శాతం మంది, అప్పుడప్పుడు ఆలోచించామని 26 శాతం మంది చెప్పారు. ప్రతి పది మందిలో ఆరుగురు (58 శాతం) అమెరికా రాజకీయాలతో విసిగిపోయామని చెప్పగా, 41 శాతం మంది వ్యక్తిగత భద్రతపై ఆందోళనతో ఉన్నట్టు సర్వే పేర్కొన్నది. ఆర్థిక ఒత్తిళ్లు.. జీవన వ్యయం: అమెరికా నగరాల్లో జీవన వ్యయం భరించలేనిదిగా మారిపోయింది. శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటిల్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఒక బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు నెల అద్దె 3,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఉంటున్నది. ప్రధాన పట్టణ, టెక్ హబ్‌లలో కుటుంబ వ్యయం మధ్య తరగతికి చాలా భారంగా మారింది. మరోవైపు ద్రవ్యోల్బణం, ఉద్యోగ భద్రత ఆందోళన కలిగిస్తున్నది. భారత సంతతి పౌరుల్లో 71 శాతం మందికి ట్రంప్ సర్కార్ అనుసరిస్తున్న అమెరికా ఆర్థిక, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు ఎంతమాత్రమూ నచ్చటం లేదు. 'అమెరికా అమెరికన్ల కోసమే' అన్న రాజకీయ విధానం, నినాదాన్ని నొక్కి చెప్పే ప్రసంగాలు భారతీయ అమెరికన్లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అమెరికాకు చెందిన వారిమనే భావన వారిలో తగ్గించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

# ఆటో డెబిట్ చేయాలంటే 24 గంటల ముందే సమాచారం


ముంబై, : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) బ్యాంకింగ్ కస్టమర్ల కోసం మరికొన్ని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఇక నుంచి బ్యాంకులు ఎలా పడితే అలా మీ అకౌంట్ నుంచి మనీ ఆటోడెబిట్ చేసుకోవడానికి వీల్లేదు. కస్టమర్ల భద్రత కోసం ఆర్బీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి ఆటో డెబిట్ చేయాలంటే కస్టమర్‌కు తప్పనిసరిగా 24 గంటల ముందు ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎంత కట్ చేస్తు?న్నారు..? దానికి గల కారణాన్ని తెలపాల్సి ఉంటుంది. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్, ఇన్సూరెన్స్ ప్రీమియం, కారు లోన్ ఈఎంఐ, హోమ్ లోన్ వంటి వాటన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. బ్యాంకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఆటో డెబిట్ చేసుకుంటే కస్టమర్లు ఫిర్యాదు చేయవచ్చు.ఆటో డెబిట్ చేసుకోవాలనుకుంటే 24 గంటల ముందు బ్యాంకులు మీకు నోటిఫికేషన్ పంపుతాయి. దీని వల్ల ఈఎంఐకు అవసరమైన డబ్బులను మీరు అకౌంట్లో ఉంచుకుంటారు. దీని వల్ల మీరు లేట్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇక ఒకవేళ ఆటో డెబిట్ తప్పు అని భావిస్తే మీరు బ్యాంక్ పంపించే నోటిఫికేషన్ ద్వారా రద్దు చేసుకోవచ్చు. బ్యాంకులు ఇక నుంచి ఇష్టానుసారం కస్టమర్‌కు ముందుగానే సమాచారం ఇవ్వకుండా డబ్బులు ఆటో డెబిట్ చేసుకోకూడదు. ముందుగా మీ అనుమతి, మీకు సమాచారం ఇచ్చాకే ఆటో డెబిట్ చేసుకోవాలి. ముందుగానే వచ్చే మెస్సేజ్ ద్వారా వివరాలు ఏదైనా తప్పు ఉంటే బ్యాంకును సంప్రదించవచ్చు. అమౌంట్ తప్పుగా ఉంటే సవరించుకోవచ్చు.ఒకవేళ 24 గంటల ముందే బ్యాంకులు మీకు ఆటో డెబిట్‌కు సంబంధించి సమాచారం ఇవ్వకపోతే ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. ఇక వినియోగదారుడి సమ్మతి లేకుండా ఒక్క రూపాయి కూడా బదిలీ చేసుకునే హక్కు బ్యాంకులకు లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్యాంకులు దీనిని తప్పనిసరిగా పాటించాలని ఆర్బీఐ కొత్త నిబంధనల్లో పేర్కొంది. చాలామంది ఈఎంఐల గురించి మర్చిపోతారు. దీని వల్ల ఈఎంఐ సమయానికి అకౌంట్‌లో డబ్బులు లేకపోతే బ్యాంకులు బౌన్స్ ఛార్జీలు విధిస్తూ ఉంటాయి. ఇక నుంచి అలాంటి ఛార్జీలు మీకు ఉండవు. బ్యాంకులు ముందే సమాచారం ఇవ్వడం వల్ల మీ అకౌంట్లలో ఆ టైమ్‌కి డబ్బులు ఉంచుకుంటారు. బౌన్స్ ఛార్జీలను బ్యాంకులు భారీగా వసూలు చేస్తున్నాయి. దీనికి ఇప్పటినుంచి చెక్ పడనుందని చెప్పవచ్చు.

# ఇక చైనాకు చుక్కలే

న్యూఢిల్లీ: ప్రపంచ దృష్టి పశ్చిమాసియా యుద్ధం, శాంతి చర్చలపై ఉంది. దేశ ప్రజల దృష్టి ఐదు రాష్ట్రాల ఎన్నికలు, వాటి ఫలితాలపై ఉంది. ఈ సమయంలో కేంద్రం దేశ సరిహద్దులో మొదలు పెట్టిన ఓ పనిని పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టింది. లద్దాక్‌లో కీలక టన్నెల్ పనులను దాదాపు ముగించబోతోంది. బాల్క్ నుంచిమినామార్గ్ వరకు 13 కిలోమీటర్ల పొడవైన జోజులా పర్వతాన్ని తవ్వుతూ, రోజుకు 4 మీటర్ల వేగంతో పనులు జరుగుతున్నాయి. మే 30 నాటికి మిగిలిన 300 మీటర్లు పూర్తి చేయబోతున్నారు. దీనికి న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ పద్ధతి వాడుతున్నారు.అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు జోజులా పాస్ మంచుతో కప్పిపోతూ, శ్రీనగర్ లద్దాక్ మార్గం మూసుకుపోతుంది. స్థానికులు ఆహారం, మందులు నిల్వ చేసుకుంటారు; సైన్యం ఇంటర్ కంటినెంట్ ప్లాన్లతో స్వయం సమృద్ధిగా ఉంటుంది. ఈ టన్నెల్ పూర్తయితే, 365 రోజులు వాహనాలు, భారీ ఆయుధాలు తరలింపునకు వీలవుతుంది. ప్రస్తుతం 29 కి.మీ./గం వేగం 70 కి.మీ./గం అవుతుంది. దూరం, ఖర్చు గణనీయంగా తగ్గుతాయి. 2018 నుంచి చైనా లద్దాక్ భూభాగాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోంది, భారత్ ధైర్యంగా తిప్పికొట్టింది. ఈ ప్రాజెక్ట్ చైనా-పాక్ సరిహద్దుల్లో సైనిక ఉద్దీపనను బలోపేతం చేస్తుంది. హిమాచల్ నుంచి దక్షిణ లద్దాక్‌కు ఆధార మార్గం (నిము పదుమ్ దార్చా) జోజులాను మరింత కీలకం చేస్తుంది. శింకు లా టన్నెల్ (4.1 కి.మీ., 15,800 అడుగుల ఎత్తు) కూడా హిమాచల్ లద్దాక్ కనెక్ట్‌ను లింక్ చేస్తుంది.ఈ ఇన్‌ఫ్రా పుష్ రక్షణ భద్రతను పెంచడమే కాక, వాణిజ్యం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. బిలాస్పూర్-మనాలీ-లెహ్ రైలు (రూ.1.31 లక్షల కోట్లు), లెహ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ (రూ.640 కోట్లు)లతో కలిపి లద్దాక్ 'ట్సునామి ఆఫ్ డెవలప్‌మెంట్'కు సాక్షియైంది. రూ.20,660 కోట్లు రోడ్లకు కేటాయించారు. బీఆర్‌వో ప్రాజెక్ట్ విజయక్‌లో లెహ్?చాలుంకా, కార్గిల్ దుమ్గిల్ మార్గాలు మెరుగయ్యాయి.

# డీలిమిటేషన్ అధికార కూటమికి బ్రహ్మాస్త్రం

**విజయవాడ,తెలంగాణ దిశ :** డీలిమిటేషన్ దెబ్బ నుంచి తృటిలో వైసీపీ తప్పించుకుం ది. పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి పాలు కావడం వైసీపీకి లోలోపల ఆనందాన్ని ఇచ్చింది అని అంటున్నారు. ఎందుకంటే ఈ బిల్లు కనుక సవ్యంగా పాస్ అయి ఉంటే ఏపీలో తొలి దెబ్బ వైసీపీకే పడేది అని అంటున్నారు. అధికారంలో కూటమి ప్రభుత్వం ఉంది. చంద్రబాబు సీఎం గా ఉన్నారు. ఆయన అపర చాణక్యంతో డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది అంటే వైసీపీ బలమంతా దూది పింజె మాదిరిగా ఎగిరిపోయేదని విశ్లేషణలు ఉన్నాయి. వైసీపీ బలం ఉన్న చోట్ వీక్ చేస్తూ ఆ పార్టీ పుట్టె ముంచగలిగే విధంగా ఈ డీలిమిటేషన్ అధికార కూటమికి ఒక బ్రహ్మాస్త్రంగా పనిచేసేది అని అంటున్నారు. ముఖ్యంగా రాయలసీమ వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్. ఇక్కడ ఫ్యాన్ పార్టీ కకావికలు అయ్యే విధంగా కూటమి భారీ స్కెచ్ రూపొందించింది అన్న వార్తలు కూడా ఆ మధ్య వినిపించాయి. ఆఖరికి వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల సైతం రెండు ముక్కలు అయ్యేదని వైసీపీ కుటుంబానికి యాభై ఏళ్ళుగా కంచుకోటగా ఉన్న ప్రాంతం పూర్తిగా కొత్త రూపు



సంతరించుకుంటే జగన్ కి పోటీ చేసేందుకు సైతం వేరే నియోజకవర్గం ఎంపిక చేసుకునే పరిస్థితి ఉండేదని కూడా చర్చ సాగింది. అంతే కాదు వైసీపీకి చెందిన దిగ్గజ నేతల స్థావరాలు సైతం డీలిమిటేషన్ ప్రక్రియలో కొట్టుకుని పోయేవని కూడా ప్రచారం సాగింది. అయితే డీలిటేషన్ ప్రక్రియ అన్నదే లేకుండా చివరిలో ఇండియా కూటమి యాంటీ చేసి గండి కొట్టింది. మహిళా బిల్లుని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని డీలిమిటేషన్ కాకుండా చేశారు అని జగన్ భారీ ట్వీట్ చేసి మరీ జాతీయ స్థాయిలో విపక్షాలను విమర్శించినా లోగుట్టు అయితే వైసీపీకి ఈ పరిణామం మహదానందం కలిగించింది అని అంటున్నారు. విపక్షం అంతా ఒక్కటిగా నిలిచి బిల్లుని ఓడించకపోతే ఈపాటికి దేశంలో విపక్షాల భయాలు సందేహాలు ఎలా ఉన్నా ఏపీలో మాత్రం వైసీపీకి అసలుకే ఎసరు వచ్చేసి ఉండేదని అంటున్నారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు అని అంటున్నారు. అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి ఇంకా చేతిలో మూడేళ్ళ పాటు అధికారం ఉంది. దాంతో పాటుగా పట్టుదలకు మారు పేరు అయిన ఆయన మరో రూపంలో కనుక ఈ డీలిమిటేషన్ బిల్లు తీసుకుని వస్తే ఎలా అన్నదే చర్చగా ఉంది. అంతే కాకుండా ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉంది. కేంద్రంలో టీడీపీ మంత్రులు ఉన్నారు. కాబట్టి డీలిమిటేషన్ ప్రక్రియ జాతీయ స్థాయిలో నిలిచిపోయినా ఏపీ తెలంగాణా రాష్ట్రాల మేరకు అసెంబ్లీ సీట్ల పెంపుదలకు గట్టిగా పట్టుబట్టి ఒప్పించినట్లు అయితే ఆ రూపంలో అయినా సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అదే జరిగితే పులి మీద పుట్ర అన్నట్లు మరో కొత్త ముప్పు వైసీపీకి పొంచి ఉన్నట్లే అని అంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతానికి మాత్రం వైసీపీకి భారీ రిలాక్స్ అయితే వచ్చిందని అంటున్నారు. మరి ఇంతా చేసి ఎందుకు డీలిమిటేషన్ బిల్లుకు వైసీపీ మద్దతు ఇచ్చింది అంటే అక్కడే ఉంది రాజకీయ మతలబు అని అంటున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కి చెడ్డ కాకుండా అక్కడ ఓటేసినా మనసంతా డీలిమిటేషన్ బెంగతోనే నిండిపోయిందని అంటున్నారు. అలా వైసీపీ బెంగ పడిన వేళ కాగల కార్యాన్ని ఇండియా కూటమి తీర్చేసింది అని అంటున్నారు. మొత్తం మీద అయితే రాహుల్ గాంధీకి వైసీపీ థాంక్స్ చెప్పుకోవాలని సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ పడుతున్నారు

### రైల్వే కోడూరు రోడ్డులో గాయాలతో కనిపించిన జింక.. తిరుపతికి తరలింపు


రైల్వే కోడూరు : రైల్వే కోడూరు పట్టణ పరిధిలో ఓ జింక తీవ్ర గాయాలతో రోడ్డుపై కనిపించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణంలోని ఎంజీ రోడ్డులో గాయాలపాలై నిస్సహాయ స్థితిలో పడి ఉన్న జింకను గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. లారీ పైనుంచి కింద పడటం వల్లే జింకకు ఈ తీవ్ర గాయాలు అయి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు, గాయపడిన జింకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం, సంరక్షణ నిమిత్తం జింకను తిరుపతికి తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అధికారులు వచ్చేంత వరకు జింకను స్థానికులు నీరు తాపించి.. సురక్షితంగా చూసుకున్నారు.



# భవిష్యత్తుకు తగ్గ అధ్యాపకులను తీర్చిదిద్దుతాం

### గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో డాక్టర్ రిచా శర్మ

**పటాన్ చెరు,తెలంగాణ దిశ :** భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అధ్యాపకులను తీర్చిదిద్దే చైతన్యవంతమైన కేంద్రంగా గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను రూపొందించినట్టు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా శర్మ పేర్కొన్నారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కొత్తగా రూపొందించిన అధ్యాపకుల గదులు, విద్యార్థుల కోసం నెలకొల్పిన కంప్యూటర్ ల్యాబ్ ను అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆయా ప్రదేశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిచా శర్మ మాట్లాడుతు ఈ కొత్త మౌలిక సదుపాయాల వెనుక ఉన్న దార్శనికతను వివరించా రు. విద్యా పరమై న సహకారాన్ని, అర్థవంతమైన సంభాషణలను ప్రోత్సహించి, భవిష్య త్తు అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులను తీర్చిదిద్దుతున్నట్టు తెలియ జేశారు. వినూత్నమైన అభ్యాస వాతావరణా న్ని సృష్టించడం ద్వారా గీతం యొక్క బహుళ విషయక విద్యా సంస్కృతిని బలోపేతం చేయడానికి తమ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కట్టుబడి ఉందన్నారు. జాతీయ విద్యా విధానం-2020 దార్శనికతకు అనుగుణం గా, 2026 -27 విద్యా సంవత్సరం నుంచి రెండు నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యా య విద్యా కార్యక్రమాలను (ఐటీఈపీ) ప్రారంభించనున్నట్టు కూడాడాక్టర్ రిచా శర్మ ప్రకటించారు. విషయ పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన ఉపాధ్యాయ శిక్షణతో అనుసంధానించేలా బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ కోర్సులను రూపొందించినట్టు తెలియజేశారు. బలమైన బోధనా నైపుణ్యాలు,



తరగతి గది నిర్వహణ సామర్థ్యాలు, పెంపొందించుకుంటూ, సైన్స్, గణితం, ఆంగ్లం లేదా సాంఘిక శాస్త్రాలలో ప్రత్యేకత సాధిస్తారని ఆమె వివరించారు. వ్యక్తిగత మార్గదర్శనం, ఉన్నత-నాణ్యత గల విద్యా ప్రమాణాలను నిర్ధారించడానికి, ఒక్కో కోర్సులో 50 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని డాక్టర్ రిచా శర్మ వెల్లడిం చారు. ప్రతిభావంతులైన అభ్యర్థులకు ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. నిష్పక్షపాతమైన, ప్రతిభ ఆధారిత ఎంపిక ప్రక్రియను నిర్ధారిస్తూ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి తరఫున జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎన్.సీ.ఆర్.టీ)లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని ఆమె స్పష్టీకరించారు.

# చెత్తను వేయకుండా సూపర్ ప్లాన్

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో దీనినిఅమలు చేస్తోంది. చెత్త వేసే ప్రదేశాలను శుభ్రపరి చి.. దేవుడి ఫోటోలు, మొక్కల కుండీలు, ముగ్గులు ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఆ ప్రదేశంలో మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇది మంచి ఫలితాలు ఇవ్వటంతో త్వరలోనే విశాఖ నగరం మొత్తం అనుసరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.వీధుల్లో నడిచివెళ్లేటప్పుడూ.. కొన్నిసార్లు గోడలపై గమనించే ఉంటారు.. ఇక్కడ మూత్రం పోసిన వాడు గాడిద. ఇక్కడ చెత్త వేస్తే శిక్షార్హం.. అంటూ కొటేషన్లు, హెచ్చరిక బోర్డులు గమనించే ఉంటారు. ఎవరెన్ని కొటేషన్లు రాసినా.. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొంతమంది మాత్రం పద్ధతి మార్చుకోరు. పరిశుభ్రతతో పనిలేదు.. అధికారులహెచ్చరికలతో అస్సలు అవసరం లేదు.. తమ పంథా తమ దే..తమ పని తమదే. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.చెత్త వేసే స్తూ ఉంటారు. ప్రభుత్వం ఇంటింటికీ చెత్త సేకరణ జరుపుతున్నా.. చెత్త కుండీలు ఏర్పాటు చేసినా క డా ఇలాంటి వారిలో మార్పులు ఆశించడం అత్యాశే అవుతోంది. కాలనీలలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్తను పారబోస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమ వుతున్నారు. అలాంటి చోట్ల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి వారిలో ఎలాంటి మార్పూ లేదు.దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొ రేషన్ (జీవీఎంసీ) ఓ సరికొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకా రంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని




అమలు చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. ఎక్కడైతే వ్యర్థాలను పారేస్తున్నారో అలాంటి ప్రదేశాలను గుర్తించి.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంచేస్తున్నారు. ఆ తర్వాత దేవుడి ఫోటోలు పెట్టి.. ముగ్గులు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల కుండీలలో మొక్కలు ఉంచుతున్నారు. ప్రయోగాత్మకంగా కొన్నిచోట్ల ఈ పద్ధతి అనుసరించగా సత్ఫలితాలు వచ్చాయి. అ ందుకే విశాఖపట్నం నగరం మొత్తం ఈ విధానం అనుసరించాల నిజీవీఎంసీ ఆలోచనలు చేస్తోంది. దేవుడి ఫోటోలు పెట్టడం, ము గ్గులు పెట్టటంతో చెత్త వేసేవారిలో మార్పు వస్తోంది. తమ చర్యలను విరమించుకుంటున్నారు. దీంతో విశాఖపట్నం మొత్తం ఈకార్యక్రమం అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వవార్డులో ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్9లో ఇటీవల జీవీఎంసీ ఈ కార్యక్రమం నిర్వహించింది.

# 2వేల 200 కిలోమీటర్లకు గ్రేటర్ హైదరాబాద్




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీని విస్తరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌ను (ఔటర్ రింగ్ రోడ్) ఆనుకుని ఉన్న 27అర్బన్ లోకల్ బాడీలను (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా తెలంగాణ మునిసిపల్ యాక్ట్, జీహెచ్ఎంసీ యాక్ట్‌ను సవరణ చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రాష్ట్రంలో మరో కొత్తడిస్కం (మూడోది) ఏర్పాటునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త డిస్కం పరిధిలోకి ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్స్ వస్తాయన్నారు.ఇక, ప్రతి కార్పొరేటర్ డివిజన్ కు రూ.2కోట్ల విడుదలకు కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అటు 27 మున్సిపాలిటీ లు, కార్పొరేషన్లు ఉఊఓఅలో కలిపుతూ ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం జీహెచ్ఎంసీ కౌన్సిల్ ముందు పెట్టారు మేయర్. 2 కోట్ల వరకు పనులకు నిధులు మంజూరు చేయడం మంచి నిర్ణయం అని కార్పొరేటర్లు అన్నారు.2007 వరకు ఓఅఊ 173 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2009కి ముందు 100 డివిజన్లు, 2009 తర్వాత 150 డివిజన్లు వచ్చాయి. 625 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించింది. ఇప్పుడు జీహెచ్ఎంసీ భారీగా విస్తరించనుంది. ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరిస్తే 2వేల 200 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరణ జరిగే అవకాశం ఉంది. దీంతో ఉఊఓఅలో డివిజన్లు భారీగా పెరగనున్నాయి.పెద్ద అంబర్ పేట్,జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల,తుక్కుగూడ, మేడ్చల్,నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్. ఈ విలీనం ద్వారా జీహెచ్ఎంసీ పరిధి, జనాభా భారీగా విస్తరించనుంది.ఇక రాష్ట్రంలో మూడో డిస్కం (విద్యుత్ పంపిణీ సంస్థ) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్‌పై ఉన్న రూ. 59,671 కోట్ల నష్టాల భారాన్ని తగ్గించడానికి పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రస్తుత డిస్కంల పరిధిలో ఉండగా.. మిషన్ భగీరథ, మెట్రో వాటర్ బోర్డులకు సంబంధించిన విద్యుత్ సరఫరాను కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురానున్నారు.

# కన్నీరు తెప్పిస్తున్న రొయ్యలు



**ఏలూరు,తెలంగాణ దిశ :** ఇన్నాళ్లు కాసుల వర్షం కురిపించిన రొయ్యల పెంపకం నేడు కన్నీరు తెప్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో రొయ్యల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంతో పాటు మరొక వైపు రొయ్యల పెంపకం ఖర్చులు విపరీతంగా పెరిగి పోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలకు మాత్రం వారి సమస్యలు పట్టడం లేదు. ఎగుమతులు ప్రస్తుతం పెద్ద సమస్యను ఎదుర్కొంటున్నాయి. అమెరికా, యూరప్ దేశాలు రొయ్యలపై ఎక్కువ పన్నులు వేసేయడంతో చాలా ఆర్డర్లు రద్దయిపోయాయి. ఈ కారణంగా రాష్ట్రానికి దాదాపు ఇరవై ఐదు కోట్ల రూపాయల మేరకు నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.రొయ్యల పెంపకంలో వినియోగించే ఫీడో, వినియోగించే మందులు, విద్యుత్తు ఛార్జీలతో ఖర్చు తడిసి మోపెడవుతుంది. తీరా రొయ్యల పంట చేతికి వచ్చేసరికి గిట్టుబాటు ధర లభించడం లేదు. గత కొన్ని రోజులుగా ఎగుమతులు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి అయ్యే రొయ్యలకు విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉండేది. కానీ అన్ని దేశాలు రొయ్యల ఎగుమతులపై పన్నులు పెంచడంతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశీయ మార్కెట్ లో రొయ్యలను విక్రయిస్తుండటంతో ధరలు కిందకు పడిపోయాయి.రొయ్యలు ధరలు భారీగా పడిపోవడంతో పెట్టుబడులు తిరిగి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు అప్పుల్లో క రుకుపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో రొయ్య పిల్లలను సరఫరా చేసే హాచరీస్, ప్రాసెసింగ్ యూనిట్లు క డా తమ ఉత్పత్తులను తగ్గించుకున్నాయి. రొయ్యల కు డిమాండ్ తగ్గిపోవడంతో ఆ ప్రభావం రవాణా, పోర్టు వంటి వాటిపై క డా పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఆదుకోవాలని, రొయ్యలకు సరైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని, ఫీడ్, మందులు సబ్సిడీ ప్రాతిపదికన అందించాలని కోరుతున్నారు.


## హస్తినపై మనస్సులో..
# అమరావతిలో తనువు

ఏలూరు,తెలంగాణ దిశ :డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎమ్మెల్యే పదవి పట్ల సంతృప్తిగా లేరు. ఆయన చూపంతా హస్తినపైనే ఉంది. గత ఎన్నికల సమయంలో రఘురామ కృష్ణరాజు నరసాపురం పార్లమెంటు టిక్కెట్ కోసం చివర వరక ప్రయత్నించారు. అయితే అది బీజేపీ కోటాలోకి వెళ్లిపోవడంతో ఆయనకు ఎక్కడో ఒకచోట స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉండి శాసనసభ నుంచి టీడీపీ పోటీ చేయించింది. గెలిచిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించింది. కేబినెట్ ర్యాంకు పదవి అయినప్పటికీ ఆయన మనసంతా ఢిల్లీపైనే ఉంది. వచ్చే ఎన్నికల నాటికి తాను పార్లమె ంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లే కనపడుతుంది. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు క డా ఇలాగే ఉ ంటున్నాయి.ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు క డా ఇలాగే ఉంటున్నాయి. అయితే అప్పటికే ఉండి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంతెన రామరాజును ఒప్పించి రఘురామ కృష్ణరాజుకు టీడీపీ నాయక త్వం ఆ సీటును కేటాయించింది. మంతెన రామరాజుకు నామినే టెడ్ పోస్టు ఇచ్చింది. ఆయనను ఏపీఐఐసీ ఛైర్మన్ గా నియమించింది. అయితే అక్కడ జనసేన లో క డా కొంత అసంతృప్తి కనపడుతుంది. ఉండి నియోజకవర్గం తమకు కావాలని గత ఎన్నికల్లోనే జనసేన గట్టిగా పోరాడింది. అయితే రఘురామ కృష్ణరాజు కోసమే కాకుండా,టీడీపీ సిట్టింగ్ సీటు కావ డంతో జనసేకు ఇవ్వలేదు. పదవి దక్కకపోవడంతో ఆయన అసం తృప్తిగా ఉన్నారని సమాచారం. తన అసంతృప్తిని సన్నిహితుల ముందు వెళ్లగక్కుతున్నారట.మరొకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాత్రం వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయడానికి పెద్దగా ఇష్టపడటం లేదు. రఘురామ కృష్ణరాజుకు రాష్ట్ర రాజకీయాల క ంటే ఢిల్లీలో ఉండటమే ఎక్కువగా ఇష్టపడతారు.

# దేశానికి అవసరమైన మందు సార్వజనీన ఆరోగ్య సంరక్షణ

మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్న ఆకాంక్షలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మెరుగైన జీవితాలు సాధ్యపడతాయన్న ఆశలు కలుగుతాయి. ప్రపంచ పర్యావరణంలో ప్రతికూల మార్పులు, సాయుధ ఘర్షణలు,వాణిజ్య యుద్ధాలు, పొంచిఉన్న అంటువ్యాధు లు, తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలు, సంకుచిత దేశభక్తి మాటున చెలరేగుతున్న విద్వేషపు జాతి హననాలు, వర్ణ వివక్ష వంటి అనేక సమస్యలు, సంక్షోభాల నడుమ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం శాంతి,సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్న ఆశాభావం జనాల్లో నెలకొని ఉన్నది.ఆయురారోగ్యాలతో వర్ధిల్లమని మనం దీవిస్తుంటాం. అయితే మన ఆరోగ్య రంగం పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ వైద్య సేవలు ఏమేరకు ఆశాజనకంగా ఉన్నాయి. అన్న ప్రశ్న అదే రంగంలో పనిచేస్తున్న నాకు ఎదురవుతుంది. కెనడా లోని అల్‌బెర్టా రాష్ట్రంలోని ఓ ఆసుపత్రిలోఎమర్జెన్సీ వైద్యం కోసం వచ్చి 8గంటలు వేచి చివరికి ప్రాణాలు కోల్పోయిన 44ఏళ్ళ భారతీయ మూలాలు కలిగిన వ్యక్తి విషాద కథనం మనం విన్నాం. మన దేశంలోనూ అలాంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి. వైద్యుడు అందుబాటులోకి వచ్చే లోపే ప్రాణాలు కోల్పోతున్న పేషెంట్ల సంఖ్య తక్కువేమీ కాదు.

ఇక డబ్బుగల వారికి జబ్బు చేసినా ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసయినా తగిన వైద్యం పొందగలుగుతున్నారు. ఈ మధ్యనే ఒక బడా కార్పొరేట్ ఆసుపత్రి తన ఆదాయం ప్రతి రోగికి తలసరిన 9 శాతం పెరిగి సుమారు ల డెబ్బై వేల రూపాయలకు పైగా గిట్టుబాటు అవుతున్నదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో రెండవ త్రైమాసిక ఆర్జన వివరాలు ఆ కార్పొరేట్ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులకు వీనుల విందుగా ఉండి ఉంటాయిగానీ మనకు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. ప్రజారోగ్య సంరక్షణ పట్ల నాకు ఉన్న అనురక్తి దృష్ట్యా×ప్రభుత్వం సార్వజనీన ప్రజారోగ్య సంరక్షణ కోసం కేవలం మాటలకే పరిమితమైతే సరిపోదనిపిస్తుంది. ఈ విశాల భూభాగంలో నివసించే ప్రతి పౌరుడికీ కావాల్సిన సకల వైద్య సేవలు సులువుగా అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సుదృఢమైన కృషి చేపట్టాలి. ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి అని ప్రభుత్వం గ్రహించాలి. అంతేగాక ఆరోగ్యాన్ని మానవ హక్కుగా పరిగణించాలి. ఆ హక్కును పరిపుష్టం చేసే నైతిక లక్ష్యంతో, భౌగోళిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి పౌరులందరికీ సార్వజనీన వైద్య సౌకర్యం కల్పించేలా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కల్పించాల్సిన ఆరోగ్య సేవలు విస్తృతంగా ఉండాలి. రోగ నివారణ, రోగ నిర్ధారణ, తగిన సమయంలో తగిన వైద్యం అందేలా చూడడం, అవసరమైన మేరకు ఆసుపత్రిలో సంరక్షణ కల్పించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం వంటి అంశాలన్నీ నెరవేర్చాలి. కఠోర వాస్తవాలు: క్రియాశీల, సమత్వ, సహానుభూతితో కూడిన×ఆర్థికంగా అందరికీ మెరుగైన×ఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చెయ్యడం మౌలికమైన అవసరమని గుర్తించాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆర్థికంగా, మానవ వనరుల పరంగా అత్యంత పటిష్టంగా ఇంటింటికీ వైద్య సేవలు, అందించేంత శక్తివంతంగా ఉండాలి. వీటిని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలుగా, విశాల వేదికగా మలచడం ద్వారా అనేకానేక మానవాభివృద్ధి కార్యక్రమాలకు వీటినే మందుపీఠిన ఉండేలా రూపొందించవచ్చు. అయితే ప్రాథమిక ఆరోగ్య సేవలు విడిగా మనజాలవు. కొంత మందికి మరింత మెరుగైన వైద్యం అవసరం పడుతుంది. తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా సెకండరీ లేదా ప్రాంతీయ వైద్య సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' కేంద్రాలుగా పని చెయ్యాలి. అవసరమైన వారికి మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందేలా చూడడంతో పాటు ఆసుపత్రి నుండి తిరిగి ఇంటికి వచ్చేశాక కూడా వైద్య పర్యవేక్షణ కొనసాగేలా చూడాలి. ఇదీ ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నమూనా. కాని ప్రస్తుతం మన ఆరోగ్య వ్యవస్థ ఈ నమూనాకు అత్యంత దూరంలో ఉందనేది కఠోర వాస్తవం. మన దేశంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సేవలు అస్తుబిస్తుగా ఉన్నాయి. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటు చాలా బలహీనంగా ఉన్నది. ఇక 'జాతీయ ఆరోగ్య కార్యక్రమం'లో తమ స్థానం ఏమిటో తెలియని అయోమయ స్థితిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులలో కోతలు పడుతున్నకొద్దీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ డోలాయమాన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. గత డిసెంబర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతి 2000 మంది జనాభాకు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' నెలకొల్పుతామంటూ చేసిన ప్రకటన మూలంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం అవుతాయనే ఆశ చిగురించే అవకాశముంది. వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే ఈ ఆరోగ్య మందిరాలను నెలకొల్పారుగానీ సెకండరీ/ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలతో వీటిని పూర్తి స్థాయిలో అనుసంధానం చెయ్యలేదు. అలాగే 'రిఫరల్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నది.




ఇక ప్రభుత్వ ప్రాయోజిత హెల్త్ ఇన్సూరెన్స్ పథకం 'ప్రధానమంత్రి జన ఆయుష్ యోజన' (పి.ఎం.జె.ఎ.వై) ఆసుపత్రిలో 'ఇన్–పేషెంట్' ఖర్చులకు పూచీ పడుతుంది కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవల ఖర్చులను 'కవర్' చేయడం లేదు. ప్రభుత్వ ప్రాయోజిత ఇన్సూరెన్స్ పథకాలేవీ 'అవుట్ పేషెంట్' చికిత్సకయ్యే ఖర్చులను భరించడం లేదు. వాస్తవానికి 'అవుట్ పేషెంట్' వైద్యానికి అయ్యే ఖర్చులో 60 నుండి 70 శాతం ఖర్చులు పరీక్షలు చేయించుకోవడానికి, మందులు కొనడానికే అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అవసరమైన తక్షణ వైద్య సేవలు అందించడంతో పాటు మెరుగైన వైద్య సౌకర్యం అవసరమైన వారిని మాత్రమే సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రుల కు 'రిఫర్' చేసే పటిష్ట వ్యవస్థగా కూడా పనిచేయాలి. చాలా దేశాల్లో రిఫరల్ వ్యవస్థను అనివార్యం చేశారు. తద్వారా సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రుల మీద ఒత్తిడి తగ్గుతుంది.

ఆరోగ్య సేవల ప్రైవేటీకరణతో తలెత్తే సమస్యలు: మన దేశంలో ప్రైవేటు వైద్యరంగ విస్తృతి చాలా ఎక్కువ. కాబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' వ్యవస్థగా క్రియాశీలంగా పని చేయడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చు. ప్రభుత్వ రంగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఆసుపత్రి లేదా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని స్పెషలిస్టు డాక్టర్ల నుండి టెలీ వైద్య సలహాలు, సేవలు పొందే వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

అయితే ప్రైవేటు కార్పొరేట్ వైద్యరంగ విస్తృతి మూలంగా, ప్రాథమిక ఆరోగ్య రంగ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం మూలంగా, వైద్య వృత్తిలో నిపుణులు, నిపుణులు కానివారు కూడా ఉండడం వల్లనా చాలా చిక్కులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య రంగంలోకి కార్పొరేట్ ప్రైవేటు రంగం కాలుపెడితే 'రిఫరల్' వ్యవస్థ ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చే సాధనంగా మారుతుంది.

కార్పొరేట్ ఆసుపత్రులు ప్రధానంగా నగరాలు, పెద్ద పట్టణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి అత్యంత ఆధునిక వైద్య సేవలు అందిస్తాయి. కానీ దానికి అయ్యే ఖర్చులు భారీగా ఉంటాయి.

ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'ఎయిమ్స్' వైద్య సంస్థలను నెలకొల్పడం ద్వారా 'ప్రాంతీయ' వైద్య సేవలను ప్రభుత్వ రంగంలో ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ప్రైవేటు యాజమాన్య కాలేజీ ఆసుపత్రులు కూడా ఈ సేవలు అందించవచ్చు. అయితే సెకండరీ వైద్యసేవల రంగం ఇప్పటికీ బలహీనంగా ఉంది కాబట్టి తక్షణమే జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలి.అటు కేంద్ర ప్రభుత్వంగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు గానీ జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేయడానికి తగిన నిధులు కేటాయించకపోగా ఇందులో వివిధ సేవలను అవుట్‌సోర్స్ చేయడం లేదా ప్రైవేటు రంగం మౌలిక సౌకర్యాల పెంపుదలకు పెట్టుబడులు పెడితే యాజమాన్య నిర్వహణను వాటికి అప్పచెప్పడం కొనసాగుతుంది. దీనిమూలంగా సార్వజనీన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించాలన్న లక్ష్యం, దీనితో అనుసంధానించి అందించాల్సిన సెకండరీ, ప్రాంతీయ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి.

జిల్లా ఆసుపత్రుల్లో రేడియాలజీ, లేబొరేటరీ సేవలు అందించడానికి తగిన యంత్రాంగం, సాంకేతిక సిబ్బంది కొరత వల్ల వీటిని ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ప్రైవేటు రంగానికి అప్పచెప్పారు. అలాగే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు వైద్య కళాశాలల స్థాపనకు అనువుగా జిల్లా ఆసుపత్రులను ఆయా కాలేజీలకు అప్పజెప్పాలనే ఆలోచనలో ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకపోవడం మూలంగా ఈ దుస్థితి నెలకొన్నది. ప్రజారంగ ఆరోగ్య సేవలను ఏకీకృతం చెయ్యడం పట్ల విముఖత, ప్రైవేటు రంగం పట్ల ఉన్న మోజు మూలంగా

ఈ ధోరణులు తలెత్తుతున్నాయి. ఇక్కడ మన గమనంలో ఉండాల్సిన ముఖ్యాంశం ఏమిటంటే ప్రైవేటు వైద్య రంగం ప్రధాన లక్ష్యం లాభార్జన మాత్రమే. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రైవేటు వైద్య రంగం అసలు రంగు బయట పడింది. కోవిడ్ వ్యాక్సిన్లలో కూడా ఈ రంగం వాటా కేవలం 2 శాతమే. ప్రభుత్వమే వ్యాక్సిన్లు సరఫరా చేసినా ప్రజలకు సేవలు అందించడంలో మాత్రం ప్రైవేటు రంగం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

క్షేత్ర స్థాయి వాస్తవాలు ఇవీ. ప్రభుత్వ రంగ వైద్య సేవలు అందుబాటు నానాటికీ క్షీణిస్తుంటే ప్రైవేటురంగం విపరీతంగా ఆదాయాలు పోగేసుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణను అల్లోపతి, ఆయుర్వేద వైద్యాల జమిలి తరహాలో ఏకీకృతం చెయ్యాలని యోచిస్తుంది.ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగం జిల్లా ఆసుపత్రుల నిర్వహణను ఏమేరకు చేపడుతుందనేది సందేహమే. జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసి వాటికి అనుబంధంగా నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించడమే సరైన పరిష్కారం అవుతుంది.జిల్లా ఆసుపత్రులను, వైద్య విద్యను ప్రైవేటీకరించడం మూలంగా సార్వజనీన ఆరోగ్య సేవలను అందజేయాలన్న లక్ష్యం దెబ్బతినిపోతుంది. మిశ్రమ ఆరోగ్య వ్యవస్థలో ప్రభుత్వం ప్రైవేటురంగ సేవలను కూడా యాథాశక్తి వినియోగించుకోవాలి గానీ సార్వజనీన ఆరోగ్య సంరక్షణ పట్ల తనకున్న బాధ్యతను వదిలించుకోవాలని చూడకూడదు. చివరిగా, మనం జపాన్ ను కూడా వెనక్కినెట్టి ప్రపంచంలోనే నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని చెప్పుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్యకర భారతదేశం అన్న ఆకాంక్షను సాకారం చేసుకోవాలే తప్ప ఆ బాధ్యతను వదిలించుకోవాలని చూడకూడదు. ప్రభుత్వం మనసుపెట్టి చిత్తశుద్ధితో వ్యవహరిస్తే మన ఆరోగ్య వ్యవస్థను చూసి కెనడా కూడా అసూయపడేలా చూడవచ్చు. గుండె వైద్య నిపుణుడిగా నేను చెప్పే మాటలు అక్షర సత్యాలు.

# భారీగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. హైద రాబాద్.. తెలంగాణ రాజధాని. విశ్వనగరంగా గుర్తింపు పొందింది. పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించడంతో ఇక్కడికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీంతో తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిరపడుతున్నారు. కొందరు అద్దెకు ఉంటుండగా, కొందరు ఇళుల కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు మరియు ఉన్నత స్థాయి రెసిడెన్షియల్ ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా, హైదరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2024లో ఒక స్క్వేర్ ఫీట్ ధర సగటున రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా, 2025 నాటికి ఇది కొన్ని ప్రాంతాల్లో రూ.11 వేల నుంచి రూ.12,500 దాటింది. దీనికి ప్రధాన కారణాలు ఐటీ రంగ విస్తరణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, హైదరాబాద్‌లో అద్దె ధరలు కూడా పెరిగినప్పటికీ, ఇళ్ల ధరలతో పోలిస్తే అవి నిష్పత్తిలో తక్కువ వేగంతో పెరుగుతున్నాయి. గచ్చిబౌలిలో 2 ఃఊఐ అపార్ట్‌మెంట్ అద్దె సగటున రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటే, అదే ప్రాంతంలో ఇంటి కొనుగోలు ధర రూ.80 లక్షల నుంచి రూ.1.2 కోట్ల వరకు ఉంటోంది. దీని ఫలితంగా, రెంటల్(అద్దె ద్వారా వచ్చే ఆదాయం శాతం) సగటున 4?5% వద్ద ఉంటోంది, ఇది ఇళ్ల ధరల పెరుగుదలతో సమానంగా లేదు. ఈ పరిస్థితి కొనుగోలుదారులకు ఒక సవాలుగా మారుతోంది, ఎందుకంటే అద్దెకు ఇళ్లు తీసుకోవడం కంటే కొనడం ఖరీదైన ఎంపికగా మారింది

# నష్టాలతో స్టాక్ మార్కెట్లు..!



బిజినెస్ : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నా యి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోం ది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయిం ట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా,హెచ్‌సీఎల్ టెక్నాల జీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్‌ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

మిశ్రమంగా అమెరికా మార్కెట్లు : అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ము గిసింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతు న్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.

# ఉక్కిరిబిక్కిరవుతున్న సచివాలయ ఉద్యోగులు!

## - సంబంధం లేని శాఖల పనుల అప్పగింతతో తీవ్ర పని భారం



**గుంటూరు,తెలంగాణ దిశ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఒక సర్వే పూర్తవ్వగానే మరో సర్వే బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో, ఉద్యోగులు క్షేత్ర స్థాయి సర్వేలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది. దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం సచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మంది మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హెూం సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్టు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్ హెూల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించే, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయాల్సిన సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఒ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో ఉండలేకపోతు న్నారని,.తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అంకమ్మరావు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించేస్తున్నారని ఆయన చెప్పారు.

# వైసీపీ యూ టర్న్..!

**గుంటూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నా రు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

# నిరుద్యోగమే నిరసనలకు కారణమా?

**భారత్ పొరుగు దేశమైన నేపాల్ మాదిరిగానే లడఖ్ యువత ఇటీవల పెద్ద ఎత్తున నిరసన బాటపట్టారు. ఈ నిరసనల్లో పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాల్ని సైతం కోల్పోయారు. కేవలం కొన్ని లక్షల మంది ఉన్న లడఖ్‌లో నిరసనలు జరగడానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా కాదని బిజెపి వారిస్తోంది. మరేంటి కారణం.. అంటే నిరుద్యోగమే ప్రధాన కారణమని తెలుస్తోంది. లడఖ్ వివరాల్లోకి వెళితే..**



హెచ్చుస్థాయిలోనే అక్షరాస్యత..: లడఖ్‌లో ఉన్నది మూడు లక్షల జనాభానే. అక్కడ హిందువులు, ముస్లింలు, బౌద్ధ మతస్తులు ఉన్నారు. 90 శాతం గిరిజనులే. లడఖ్‌లో జాతీయ విద్యా పథకాలు మాత్రం పేలవంగానే అమలవుతున్నా.. అక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. పురుషులు 89 శాతం, మహిళలు 65 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల తరచూ బదిలీలతో పట్టణం వెలుపల ప్రాథమిక సెకండరీ స్థాయి విద్యా బోధనలు అంతంత మాత్రమనే చెప్పుకోవచ్చు. అయినప్పటికీ అక్కడ చిన్నారులు, తల్లిదండ్రులు చదువుకు ప్రాధాన్యమిస్తుండడం గమనార్హం.

వ్యవసాయం..: దాదాపుగా ఇక్కడ వర్షపాతం ఉండదు. పంటలు హిమనదీయ కరిగే నీటి కాలువలు, బుగ్గలు మీదే పంటలు పండుతాయి. సింధు నదీ లోయలలో దాని ఉపనదులపైనే గ్రామస్తులు ఆధారపడతారు. వారు ఎక్కువగా బార్లీ,

గోధుమలు, బఠానీలను పడిస్తారు. పండ్లలో నేరేడు, ఆపిల్స్‌ని పండిస్తారు. మరోవైపు పశువుల పెంపకందారులు పాడి, ఉన్నిలను ఉత్పత్తి చేస్తారు. మేక ఫైబర్‌లను వీరు కాశ్మీర్‌కు వర్తకం చేస్తారు. అయితే లడఖ్‌వాసులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేయడానికి మాత్రం విముఖత చూపుతున్నారు.

టూరిజం..: హిమాలయ పర్వతాలు, పాంగోంగ్ సరస్సు హెూయలు, లోయలు.. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకుల్ని కనువిందు చేస్తాయి. లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకమే. 1974 నుంచే ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోనే వేలాదిమందికి ఉద్యోగ అవకాశాల్ని కల్పించాయి. ఇక్కడికి యూరోపియన్, అమెరికన్లు, భారతీయులు ఎక్కువమంది వస్తారు. ఇక్కడి పర్యావరణం పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నా.. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. విపరీతంగా నీటికొరత ఉంది. హిమాలయ పర్వతాల నుంచి కరిగే నీటిపైనే ఆధారపడడం.. పైపెచ్చు.. ఎక్కడికక్కడ ఆనకట్టల ద్వారా దిగువకు నీరు లేకపోవడంతో.. అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు కారణంగా వేసవిలో మంచు పర్వతాలు విపరీత స్థాయిలో కరుగుతున్నాయి. దీంతో శీతాకాలంలో నీటి సమస్య లేకపోయినా.. వేసవిలో మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు. సమ్మర్‌లోనే పర్యాటకుల రద్దీ ఎక్కువ. ఆ సమయంలోనే నీటి కొరత వల్ల పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతుంది. ఇది వారి జీవనాధారంపైనే ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం..: 2021-22లో 534 నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలకు 50 వేల దరఖాస్తుల్ని పంపారు. అంటే ఒక ఉద్యోగానికి ఆరుగురు పోటీ పడుతున్నారన్నమాట. ఈ విషయాన్ని స్వయంగా సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. 2021-22లో లడఖ్ నిరుద్యోగం 9.8 శాతం. అదే 2022-23కి 26.5 శాతానికి చేరిందని పార్లమెంటు సమావేశాల సందర్భంగా 2023లో రాజ్యసభలో ఎంపీలే వెల్లడించారు. ఇది జాతీయ సగటు నిరుద్యోగ రేటు 2021-22 14.9 శాతం, 2022-23 లో 13.4 శాతానికంటే ఎక్కువ.

సమస్యను పక్కదోవ పట్టించిన మీడియా: జాతీయ మీడియా మాత్రం అసలు సమస్యను పక్కకు నెట్టేసింది. ఇటీవల కాలంలో మీడియా ఏకాడికి లడఖ్ నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ ఫుంట్సోగ్ స్టాంజిత్ తెపాగ్ పాల్గొనడాన్నే హైలెట్ చేసింది. పూర్తిగా బిజెపికి వత్తాసునిచ్చింది. నిరసనలకు ముందు ఉద్యమకారుడు వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక నిరసనల గురించి ప్రసంగించారని.. ఆయన ఆయా దేశాల యువత చేపట్టిన నిరసనల్ని హైలెట్ చేయడం వల్లే బిజెపి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారని బిజెపి నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంత పెద్దఎత్తున నిరసనలు జరగడానికి కారణం.. కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ ఫుంట్సోగ్ నిరసనకారుల్ని రెచ్చగొట్టడం వల్లే జరగాయని బిజెపి ఆరోపిస్తోంది.

అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్యేక రాష్ట్ర హెూదా కానీ.. ఆ డిమాండ్ తలెత్తడానికి గల కారణాల్ని కానీ మీడియా పట్టించుకోవడం లేదు. ఇదెంత దారుణం లడఖ్ జమ్మూకాశ్మీర్ కిందకే వస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం 1995 నుంచి సొంతంగా కౌన్సిల్ పాలన సాగుతుంది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక హెూదా రద్దు చేయడంతో.. లడఖ్ వాసులు ప్రత్యేక రాష్ట్ర హెూదా కోసం డిమాండ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల కోసం ప్రత్యేక అధికారాలు కలిగిన 6వ షెడ్యూల్ కిందకి లడఖ్‌ని తీసుకురావాలని వారు నినదిస్తున్నారు. 6వ షెడ్యూల్ ద్వారా.. జిల్లా కౌన్సిల్‌లు, శాసన, న్యాయ పరిపాలన స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అక్కడి భూమి.. పరిపాలనా, చట్టాలు అన్నీ వారి అధీనంలోకి వస్తాయనే కారణంతోనే లడఖ్ ప్రజలు రాష్ట్ర హెూదా కోసం నిరసనలు చేస్తున్నారు. ఇక్కడి చైనా సరిహద్దు ప్రాంతంగా ఉందని.. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది.

# అమరావతికి హైస్పీడ్ కారిడార్..

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహ దారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు



నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చు తుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తు న్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్

కాకినాడ,తెలంగాణ దిశ : ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే.ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది.వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు.

# చెమటకాయలు పోవాలంటే..



వేసవి కాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యల్లో చెమటకాయలు ఒకటి. వీటి కారణంగా చర్మం దురద పెట్టటమే కాకుండా మృదుత్వాన్నికోల్పోతుంది. కొన్ని సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే చాలా సులభంగా చెమటకాయల నుంచి బయట పడొచ్చు. పెరుగు : చెమట కాయలు ఉన్న ప్రదేశంలో చల్లని పెరుగుని అప్లై చేసి 15 నిమిషాలు ఉంచాలి. తరువాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దాలి. పెరుగులో సహజంగాఉండేయాంటీ బ్యాక్టీరి యల్,యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ చెమటకాయలు రాకుండా చేస్తాయి. 200 ఎంఎల్ రోజ్ వాటర్‌లో నాలుగు టేబుల్ స్పూన్ల తేనె, 200 ఎంఎల్ ప్యూర్ వాటర్ కలపాలి. బాగా కలిపి ఐస్ ట్రేలో పోసి ఫ్రీజ్ చేయాలి. ఇవి క్యూబ్స్‌లా అయ్యాక నాలుగైదు క్యూబ్స్ తీసుకుని పల్చని మస్లిన్ బట్టలో చుట్టి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దాలి. రోజ్ వాటర్ చర్మం పీహెచ్ బ్యాలెన్స్‌ని మెయింటెయిన్ చేస్తుంది. ఎక్కువగా ప్రొడ్యూస్ అయ్యే ఆయిల్‌ని కంట్రోల్ చేస్తుంది.

గంధం : గంధానికి చల్లని ఫుల్ ఫ్యాట్ మిల్క్ కలిపి ఆ మిశ్రమాన్ని చెమట కాయలు ఉన్న ప్రదేశంలో పట్టించి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

ముల్తానీ మిట్టి : మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మిట్టిలో రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్ కలిపి తగినన్ని చల్లని పాలు పోసి స్మూత్ పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని చర్మం మీద అప్లై చేసి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

కలబంద : చెమటకాయలు ఉన్న ప్రదేశంలో కొంచెం కలబంద గుజ్జు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. కలబందలో ఆస్ట్రిజెంట్ లక్షణాలు ఉండటం వలన చెమటకాయలు త్వరగా తగ్గటానికి సహాయపడతాయి. చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లను కూడా తగ్గిస్తుంది.

టీ ట్రీ ఆయిల్ : టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి .కొంచెం టీ ట్రీ ఆయిల్‌ను తీసుకుని దానికి కొంచెం నీటిని కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఆ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి చర్మంపై రాస్తే చెమట కాయలు చాలా త్వరగా తగ్గిపోతాయి.

వెనిగర్ : టిష్యూ పేపర్‌ను తీసుకుని వెనిగర్‌లో ముంచి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో అద్దాలి. ఇలా చేస్తే చెమట కాయలు త్వరగా తగ్గిపోతాయి. లవంగ నూనె : కాటన్ బాల్‌ను తీసుకుని లవంగ నూనెలో ముంచి చెమటకాయలు ఉన్న ప్రదేశంలో రాస్తే చెమట కాయలు తగ్గుముఖం పడతాయి. తరచూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.


# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!



వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8–10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది. నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీరాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది. ఇక ఎక్కువ సమయంపాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి. చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి. వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!




జెస్టేషనల్ దయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ – టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయిలను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వ్యర్థం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!. %శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20 – 30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్‌ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. వాల్ నట్స్‌లో ఆల్ఫా–లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్లు కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది. చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది.

# అందానికి ఆహారం



వేసవిలో అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?



ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది. దీన్ని చాలా

## అనేక వ్యాధులు నయమవుతాయి..!

సులభంగా గుర్తించవచ్చు. ఈమొక్క తీగ జాతికి చెందినది. మన ఇంటిచుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదంచెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే



ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ా%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# అగ్రిమెంట్ చేసుకుని అవకాశాలు ఇవ్వట్లేదు..



వెబ్ సిరీసుల్లో అవకాశం ఇస్తానని మోసం చేశారని, ఇపుడు తన భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందని, అందువల్ల తాను ఆత్మహత్య చేసుకుంటానని యువనటి అనుగ్రహ ఎస్. నంబియార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'అడిపోలి' ద్వారా వెండితెరకు పరిచయమైన అనుగ్రహ... ప్రస్తుతం 'రిసార్ట్' అనే వెబ్ సిరీస్ లో నటిస్తున్నారు. ఇందులో హీరోగా విజయ్ కుమార్ నటిస్తున్నారు. ఈ వెబ్‌సిరీస్ లో నటించేందుకు యేడాది పాటు అనుగ్రహ ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ, ఇప్పుడు అవకాశం ఇవ్వకుండా మోసం చేస్తున్నారంటూ ఆమె విడుదల చేసిన వీడియో లో పేర్కొన్నారు. 'ఇపుడు నేను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యా. వెబ్‌సిరీస్ లో నటించేందుకు ఒక యేడాదికి అగ్రిమెంట్ కుదుర్చుకుని షూటింగ్‌కు పిలవడం లేదు. ఇతర చిత్రాల్లో నటించేందుకు కూడా అనుమతించడం లేదు. గత నాలుగు నెలలుగా ఇంటికే పరిమితమై ఉన్నా. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. చిత్రనిర్మాణ సంస్థను సంప్రదించగా, హీరో విజయ్ కుమార్‌ను సంప్రదించాలని చెప్పారు. దీంతో నా స్నేహితుడు విజయ్ కుమార్‌ను సంప్రదించగా ఆయన సమాధానం ఇవ్వకపోగా, ఆయన భార్య పరుష పదజాలంతో బెదిరింపు ధోరణితో మాట్లాడారు. కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నటించేందుకు అవకాశం ఇవ్వాలి. నేను కేరళ నుంచి ఇక్కడకు వచ్చాను. నాకు కలలు ఉంటాయి. ఛాన్స్ ఇవ్వకుంటే ఆత్మహత్యే నాకు శరణ్యం' అని పేర్కొన్నారు.


# రాజ్ సెలబ్రేషన్ పిక్స్ వైరల్





సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే స్టార్ హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఏప్రిల్ 28న ఆమె పుట్టినరోజు సందర్భంగా, ఆమె కు సంబంధించిన పలు విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే 2023 లోనే సిటాడెల్ సిరీస్ షూటింగ్ సమయంలో సమంత భర్త రాజ్ నిడిమోరు ఆమె పుట్టిన రోజుని అర్ధరాత్రి ఘనంగా సెలబ్రేట్ చేయగా, ఈ పిక్స్ సమంత అప్పట్లో అధికారికంగానే పోస్ట్ చేసింది. ఆ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తుందని రూమర్స్ రాగా ఈ ఫొటోలు మరింత బలం చేకూర్చాయి. ఎట్టకేలకి 2025 డిసెంబర్ లో రాజ్ – సమంత పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వీరి పెళ్లి తర్వాత వచ్చిన సమంత మొదటి పుట్టిన రోజు కావడంతో ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. మరో వైపుఏ బర్త్‌డేకు రెండు రోజుల ముందు షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. 'బర్త్‌డే వీక్' అంటూ సమంత తన జీవితంలో గత ఏడాది జరిగిన మార్పులను సూచిస్తూ కొన్ని ఫోటోలు పంచుకున్నారు. వాటికి జోడించిన వ్యాఖ్యలు అభిమానులను ఆలోచింపజేస్తున్నాయి. తనతో ఉన్నది ఏమిటి? వదిలేసింది ఏమిటి? జీవిత ప్రయాణంలో పోయినవి, మిగిలినవి ఏవో ఆమె చాలా సూటిగా వెల్లడించారు. తన ప్రయాణం ప్రారంభం గురించి చెబుతూ... పని మీద ప్రేమ, ముందుకు నడిపించే ఆత్మవిశ్వాసమే ఇప్పటికీ తన బలం అని సమంత పేర్కొన్నారు. అయితే ఎప్పుడూ ఇతరుల ఎంపిక కోసం ఎదురుచూసే స్వభావాన్ని మాత్రం వదిలేశానని తెలిపారు. జీవితంలో ప్రతీది ప్లాన్ ప్రకారం జరగకపోయినా, తన మనసు చెప్పేది వినే తీరు మారలేదని చెప్పారు. కానీ తనను నియంత్రించాలనే ఆలోచనను మాత్రం విడిచిపెట్టినట్లు వెల్లడించారు. ప్రతిదీ మారినా నా సంకల్పం మారలేదు అని సమంత చెప్పడం గమనార్హం. తాను ఎలా ఉండాలని అనుకున్నానో ఆ భావనను కూడా ఇప్పుడు వదిలేశా నని చెప్పడం ద్వారా, గతంలో జరిగిన వ్యక్తిగత పరిణామాలను సూచించినట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం తన జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని, తొందరపడే స్వభావాన్ని కూడా వదిలేశానని సమంత చెప్పారు. ప్రతి ఫోటో వెనుక ఒక లోతైన భావం దాగి ఉందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

# నాగార్జున సరసన మరోసారి టబు





అక్కినేని నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోనున్న 100వ చిత్రంలో సీనియర్ నటి టబు నటిస్తున్నారంటూ వస్తున్న వార్తలకు స్వయంగా ఆమే తెరదించారు. ఈ సినిమాలో తాను నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన సోషల్ మీడియా ఖాతాలో మూవీ క్లాప్‌బోర్డు ఫొటోను షేర్ చేసి, ఊహాగానాలకు ముగింపు పలికారు. చిత్ర యూనిట్ అత్యంత గోప్యంగా చిత్రీకరణ జరుపుతుండగా, టబు పోస్ట్‌తో ఈ విషయం తొలిసారిగా బయటకు వచ్చింది. టబు పోస్ట్‌పై దర్శకుడు రా. కార్తీక్ స్పందిస్తూ, "మేడమ్, మీతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది" అని కామెంట్ చేశారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో గతేడాది అక్టోబరులోనే ఈ సినిమా ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుగుతోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగార్జున సరికొత్త లుక్‌లో కనిపించను న్నారని తెలుస్తోంది. దాదాపు 28 ఏళ్ల క్రితం 'నిన్నేపెళ్లాడతా' సినిమాతో నాగార్జున, టబుజంట టాలీవుడ్‌లో హిట్ పెయిర్‌గా నిలిచింది.

ఆ తర్వాత 'ఆవిడా మా ఆవిడే'లోనూ కలిసి నటించారు. ఇంత సుదీర్ఘ విరామం తర్వాత ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించనుం డటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అయితే, ఈ చిత్రంలో టబు నాగార్జునకు జోడీగా నటిస్తున్నారా లేక మరేదైనా కీలక పాత్ర పోషిస్తున్నా రా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు ఉంటారనే ప్రచారం కూడా జరుగుతోంది.

# సినిమా


# 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్



సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోళీ కే పీఛే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నాపలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్లక్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతంవిశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.


## రిపోర్టర్ అడిగిన ప్రశ్నకి వేదికపై..

# కన్నీళ్లు పెట్టుకున్న పాయల్ రాజ్‌పుత్



'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తాజాగా ఒక సినిమా వేడుకలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తన వ్యక్తిగత జీవితంలోని విషాదాన్ని తలచుకుని వేదికపైనే కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ కలిచివేసింది. హేమంత్ ఇప్పలపల్లి దర్శకత్వంలో రూపొందిన 'ఫస్ట్ టైమ్ 01-01-01' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో పాయల్ చిన్ననాటి స్నేహితుడు సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్నాడు. స్నేహితుడిని ప్రోత్సహించేందుకు ముఖ్య అతిథిగా హాజరైన పాయల్, సినిమా గురించి మాట్లాడుతూ విజువల్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఈవెంట్ ముగింపు సమయంలో ఒక విలేకరి అడిగిన ప్రశ్న ఆమెను భావోద్వేగానికి గురిచేసింది. గతంలో ఆమె విపాసన ధ్యానం కోసం వెళ్లిన విషయాన్ని ప్రస్తావించగా, పాయల్ తన తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ను గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. మా నాన్నే నా జీవితానికి హీరో. నేను చేసిన ప్రతి సినిమాను ఆయనే మొదట చూసి తన అభిప్రాయం చెప్పేవారు. రీసెంట్‌గా వచ్చిన నా పంజాబీ సినిమా చూడాలని ఆయన ఎంతో ఆశపడ్డారు. కానీ ఇప్పుడు ఆయన మన మధ్య లేరు" అంటూ పాయల్ వెక్కి వెక్కి ఏడ్చేశారు. 'ఆర్‌ఎక్స్ 100' వంటి బోల్డ్ చిత్రంలో నటించినప్పటికీ తన నటనను తండ్రి మెచ్చుకున్నారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో భావోద్వేగాన్ని ఆపుకోలేక వేదికపైనుంచి వెళ్లిపోవాల్సివచ్చింది. చిత్ర బృందం ఆమెను ఓదార్చేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆమె బాధ అందరినీ కదిలించింది. పాయల్ తండ్రి విమల్ కుమార్ రాజ్‌పుత్ గత ఏడాది జూలై 28న కన్నుమూశారు. అన్నవాహిక క్యాన్సర్‌తో పోరాడుతూ 67 ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడిచారు. తండ్రి అనారోగ్య సమయంలో కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, మానసిక ఒత్తిడి గురించి పాయల్ గతంలో కూడా పంచుకున్నారు. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె విపాసన ధ్యానంను ఆశ్రయించారు. ఇది భారతదేశపు ప్రాచీన ధ్యాన విధానం కాగా, మనస్సును శాంతపరచడం, భావోద్వేగాలను నియంత్రించడం కోసం ఉపయోగపడుతుంది. ఈ ధ్యానం ద్వారా పాయల్ తన జీవితంలో జరిగిన విషాదాన్ని అంగీకరించి ముందుకు సాగేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది.

# 'మైసా' కోసం ప్రాణాలకు తెగించిన రష్మిక..



తాను పోషించే పాత్ర కోసం ఎంతటి సవాళ్లైనా స్వీకరించే కథానాయికల్లో రష్మిక మందన్న ముందుంటారు. మరోసారి ఆమె తన నటనపై ఉన్న అంకితభావాన్ని నిరూపిస్తూ వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం తెరకెక్కుతున్న 'మైసా' చిత్రంలో రష్మిక చేస్తున్న పాత్ర, అందుకు ఆమె పడుతున్న కష్టం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఇది సాధారణ గ్లామర్ పాత్ర కాకుండా, భావోద్వేగాలు, కోపం, ఆవేశం కలగలిపిన బలమైన పాత్రగా దర్శకుడు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. దర్శకుడు రవీంద్ర పుల్లె ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక చేసిన సాహసోపేత స్టంట్స్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కేరళలోని ప్రసిద్ధ అతిరపల్లి జలపాతం వద్ద ఒక కీలక యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించినట్లు తెలిపారు. ఆ సీన్‌లో భాగంగా రష్మిక ఎలాంటి డూప్ లేకుండా దాదాపు 80 అడుగుల ఎత్తు నుంచి జంప్ చేసినట్లు చెప్పారు. ఈ స్టంట్ సమయంలో ఆమె చేతులు, కాళ్లకు గాయాలు అయినప్పటికీ, ఎలాంటి విశ్రాంతి తీసుకోకుండా షూటింగ్ కొనసాగించారని వెల్లడించారు. ఆమె అంకితభావం చూసి యూనిట్ సభ్యులంతా ఆశ్చర్యానికి గురయ్యారని దర్శకుడు పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి ప్రమాదకర సన్నివేశాలకు డూప్‌లను ఉపయోగిస్తుంటారు. కానీ రష్మిక మాత్రం స్వయంగా చేయడం ఆమె డెడికేషన్‌కు నిదర్శనమని అన్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja Publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215